తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్

శుక్రవారం

23 అక్టోబర్ 2026

Follow :

## టీజీపీఎస్సీ పరీక్షకు పటిష్ట భద్రత

- పరీక్షా కేంద్రం వద్ద అప్రమత్తంగా ఉండాలి
- గీతం విశ్వవిద్యాలయంలో పోలీసు భద్రతా ఏర్పాట్ల పరిశీలన
- జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 22 (జనం సాక్షి):** తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ సైంటిస్ట్ అనలిస్ట్ గ్రేడ్-II పోస్టుల భర్తీకి ఈ నెల 24న టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కంప్యూటర్ ఆధారిత పరీక్ష నేపథ్యంలో, రుద్రారంలోని గీతం విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ గురువారం సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు, అభ్యర్థుల రాకపోకల మార్గాలు, భద్రతా చర్యలను సమీక్షించారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు అధికారులకు సూచించారు. పరీక్షా నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.

పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు.

ఈ పర్యటనలో అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, ఇస్నాపూర్ ఇన్‌స్పెక్టర్, భానూర్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కృష్ణ, మహేష్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, గీతం విశ్వవిద్యాలయ ప్రతినిధులు వర్మ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## డంపింగ్ యార్డ్‌తో రోగాల బారిన జనం.. దెబ్బతింటున్న పంట పొలాలు

- 9వ వార్డు విజయనగర్ కాలనీలో పారిశుద్ధ్యం అధ్వానం
- అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం
- పంటలు నష్టపోతున్నామని రైతుల ఆవేదన
- సమస్యలు తీర్చకపోతే మున్సిపాలిటీ ముట్టడికి హెచ్చరిక
- పాలకవర్గం లేక కుంటుపడ్డ పాలన
- మాజీ కౌన్సిలర్ చైతన్య చౌహాన్



**జడ్చర్ల, అక్టోబర్ 22 (జనంసాక్షి):** మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు జయప్రకాష్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై అధికారులు శాశ్వత పరిష్కారం చూపకపోవడం శోచనీయమని మాజీ కౌన్సిలర్ చైతన్య చౌహాన్, కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల స్థానికులు తీవ్ర రోగాల బారిన పడుతున్నారని, మరోవైపు డంపింగ్ యార్డ్ వ్యర్థాల వల్ల సమీప పొలాల్లో పంటలు దెబ్బతిని రైతులు భారీగా నష్టపోతున్నారని మండిపడ్డారు. తక్షణమే అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో పాలకవర్గం లేకపోవడంతో పాలన పూర్తిగా



కుంటుపడిందని, విజయనగర్ కాలనీతో పాటు చుట్టుపక్కల తండాల్లో పారిశుద్ధ్య పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. వార్డులోని సమస్యలపై మున్సిపల్ కమిషనర్, అదనపు కలెక్టర్‌కు అనేకసార్లు వినతిపత్రాలు సమర్పించినా, ఆధారాలుగా ఫోటోలు, వీడియోలు పంపినా అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం దారుణమన్నారు. పన్నులు వసూలు చేస్తున్న అధికారులు, కనీస పారిశుద్ధ్య వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. కాలనీలో మురుగుకాలువలు నిండి దుర్గంధం వెదజల్లుతోందని, డ్రైనేజీలు పొంగిపొర్లుతుండటంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ తో పాటు పారిశుద్ధ్య సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోకపోతే, 9వ వార్డు ప్రజలు, బాధితులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట భారీ ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శివరాములు, ఆశీర్వాదం, ఏలియా, రాజ మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, బెన్నీ, కమలం, శేఖర్, సన్నీ, సూర్య చౌహాన్, అల్తాఫ్, మొబీన్, అఖిల్, నయీమ్ ఖాన్, అంజాద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావం.. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

### యాసంగిలో వరి సాగు వద్దు.. బోరు తవ్వకాలపై కలెక్టర్ ప్రియాంక హెచ్చరిక

మిగతా 9లో..



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 22 (జనంసాక్షి):** జిల్లాలో 40 శాతం వర్షపాత లోటు, ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలమట్టాలు పడిపోతున్న నేపథ్యంలో రైతులు యాసంగిలో వరి సాగు చేయవద్దని కలెక్టర్ సీహెచ్ ప్రియాంక సూచించారు. భూగర్భ జలాల పరిరక్షణ, తాగునీటి అవసరాల దృష్ట్యా తెలంగాణ నీరు, భూమి, చెట్ల చట్టం (వాల్టా) నిబంధనల ప్రకారం రైతులు, బోర్‌వెల్ డ్రిల్లింగ్ ఏజెన్సీలకు మార్గదర్శకాలు జారీ చేశారు.

భూగర్భ జల శాఖ నివేదికల ప్రకారం జలవనరుల సహజ పునరుద్ధరణ తగ్గిందని కలెక్టర్ తెలిపారు. అధిక నీటి వినియోగం ఉండే వరి సాగుతో బోర్లలో నీరు అడుగంటిపోయి పంట నష్టంతో పాటు గ్రామాల తాగునీటి వనరులపైనా ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. రైతులు శనగ, వేరుశనగ, పొద్దుతిరుగుడు, జొన్న, సజ్జ, రాగులు, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, తక్కువ వ్యవధి కూరగాయల వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. నీటి పొదుపు కోసం డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులను వినియోగించాలని కోరారు.

జిల్లాలో వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక, గృహ అవసరాల కోసం బోర్లు తవ్వే ఏజెన్సీలు తప్పనిసరిగా సంబంధిత వాల్టా అథారిటీ లేదా భూగర్భ జల శాఖ వద్ద చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అధికారిక లిఖితపూర్వక అనుమతి లేదా ఎన్‌వోసీని పరిశీలించకుండా బోర్లు తవ్వకూడదన్నారు. ప్రభుత్వ, రక్షిత తాగునీటి వనరులైన మిషన్ భగీరథ, గ్రామపంచాయతీ, మున్సిపల్ బావులు, బోర్లకు 250 మీటర్ల

## ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ ఆదర్శ్ సురభి

- 2027 జూలై వరకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు



**వనపర్తి, అక్టోబర్ 22 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. 2027 జూలై వరకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, నీటి పొదుపుపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నీటి వనరులు, విద్యుత్ సరఫరా, పశుగ్రాసం, గ్రామీణ ఉపాధి అంశాలపై అధికారులతో చర్చించారు. జూరాల సహా ఇతర ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, సాగునీరు, తాగునీటి అవసరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రబీ పంటలకు సాగునీటి అవకాశాలు పరిమితంగా ఉన్నందున వాస్తవ పరిస్థితులను రైతులకు వివరించాలని, నీటి విడుదలపై ఉన్నతాధికారుల అనుమతులతో నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

మిషన్ భగీరథ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో పాత బోర్లు, స్థానిక నీటి వనరులను పునరుద్ధరించాలని, పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. నీటి వృథాను అరికట్టి, సంరక్షణపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా పర్యవేక్షించాలని, వ్యవసాయానికి నిర్ణీత సమయాల్లో విద్యుత్ అందించి, సరఫరా సమయాలను రైతులకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. అక్రమ విద్యుత్ వినియోగంపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.

మిగతా 9లో..

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**మల్దకల్, అక్టోబర్ 22 (జనంసాక్షి):** ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వైద్య శాఖ అధికారులకు ఆదేశించారు.

గురువారం మల్దకల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు తదితర విషయాలపై వైద్య సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ఔట్ పేషెంట్లకు పూర్తిస్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో సహజ ప్రసవాల సంఖ్య పెంచేలా ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హై రిస్క్ గర్భిణీలను ముందుగానే గుర్తించి, తగిన వైద్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణీ స్త్రీల ఏ.ఎన్.సి. రిజిస్ట్రేషన్, చెక్ అప్ వంద శాతం జరిగేలా చూడాలని అన్నారు.

ఆస్పత్రిలో అన్ని రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, రక్తపరీక్షలు, మూత్ర పరీక్షలు, ఇతర పరీక్షలను వేగంగా పూర్తి చేసితక్షణ రోగ నిర్ణయం చేయాలనిఅన్నారు. అవసరమైన మందులు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యులకు సూచించారు. కుక్క కాటు, పాము కాటు బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించేలా అవసరమైన మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోపల, బయట పరిశుభ్రతను నిరంతరం పాటిస్తూ, రోగులకు ఆరోగ్యకరమైన వాతావరణంకల్పించాలన్నారు. గర్భిణీ స్త్రీల కోసం ఏర్పాటు చేస్తున్న యోగా కేంద్రం భవన నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేయాలని, వైద్య అధికారులు, సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఝాన్సీరాణి, డాక్టర్ స్వరూపరాణి, సీనియర్ అసిస్టెంట్ కరీం, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరు జాబితాలో చోటు కల్పించాలి



## నవంబర్ 9న తుది ఓటరు జాబితా ప్రచురణ: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 22 (జనంసాక్షి):** అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026) ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు.

గురువారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు.

ఓటరు జాబితాకు సంబంధించి అందే ప్రతి అభ్యంతరం, దరఖాస్తును నిర్దేశిత విధివిధానాల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. నవంబర్ 5వ తేదీలోగా సవరణ ప్రక్రియను పూర్తి చేసి, నవంబర్ 9న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు.

ఓటరు జాబితా సవరణకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఏవైనా సమస్యలు, అభ్యంతరాలు లేదా సూచనలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇంట్లో గొడవపడి మహిళ ఆత్మహత్య



**పెద్దశంకరంపేట, అక్టోబర్ 22 (జనంసాక్షి):** వంట విషయంలో అత్తాకోడళ్ల మధ్య తలెత్తిన గొడవలో అత్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెద్దశంకరంపేట మండలం కోళాపల్లిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళ్తే గ్రామానికి చెందిన పులబోయిన శంకరమ్మ (72) తన కోడలు సావిత్రితో వంట విషయంలో గొడవపడి మనస్థాపానికి గురై గ్రామ శివారులోని కోళాపల్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబీకుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్ఐ.ప్రవీణ్ రెడ్డి తెలిపారు.

## పర్లి వైద్యనాథుడిని

# దర్శించుకున్న మదన్ రెడ్డి



**శివ్వంపేట, అక్టోబర్ 22 (జనంసాక్షి):** నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు చిలుముల మదన్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం మహారాష్ట్రలోని పర్లి వైద్యనాథ జ్యోతిర్లింగం క్షేత్రాన్ని సందర్శించి దేవాలయంలో మూలమూర్తిని స్పర్శించి, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన దేవాలయంలో మహాన్యాస పూర్వక ఏకదశ రుద్రాభిషేకం, బిల్వదాలార్చన, అర్చన, హారతి మొదలైన పూజలు నిర్వహించారు. తన కుటుంబమే కాదు యావత్ భారతదేశం బాగుండాలని మనస్ఫూర్తిగా ఆ మహాదేవుని కోరుకోవడం జరిగిందన్నారు. ఈ సమయంలో ఆయన వెంట భార్య సుజాత, యువ నాయకులు విక్రం రెడ్డి తదితరులు ఉన్నారు.

# అల్లం పంటలో కొత్త తెగులు.. కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలన

- జహీరాబాద్, కోహిర్ మండలాల్లో అల్లం పంటలను పరిశీలించిన అధికారులు
- తెగులు సోకిన ప్రాంతాల నుంచి విత్తన కొమ్ములు తీసుకురావద్దు







**కోహిర్, అక్టోబర్ 22 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, కోహిర్ మండలాల్లో అల్లం పంటలకు అగ్గి తెగులును పోలిన కొత్త తెగులు సోకడంతో కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. సంబంధిత శాఖల అధికారులు, శాస్త్రవేత్తలతో కూడిన సంయుక్త బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి పంటలను పరిశీలించింది. తెగులు లక్షణాలు, వ్యాప్తి, నివారణ చర్యలపై రైతులకు సూచనలు చేసింది.

హైదరాబాద్‌లోని కేంద్ర సమగ్ర సస్యరక్షణ కేంద్రం (సీఐపీఎంసీ) ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారులు వెంకటరెడ్డి, బసవన్నప్ప, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి ఉదయశంకర్ ఈ బృందంలో పాల్గొన్నారు. సంగారెడ్డి ఫల పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ మౌనిక, డీడీఎస్-కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శైలజ, స్థానిక ఉద్యాన శాఖ అధికారులు సునీత రోస్, సతీష్ తదితరులు పంటలను పరిశీలించారు.

**కర్ణాటక, కేరళలోనూ వ్యాప్తి...**

కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోనూ ఈ తెగులు వ్యాపించినట్లు అధికారులు తెలిపారు. తెలంగాణలో అల్లం పంటల్లో ఇలాంటి లక్షణాలు కనిపిస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేరళలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పైసెస్ రీసెర్చ్ శాస్త్రవేత్తలు ఈ తెగులుకు కారణమైన ప్రాక్సిఫైరిక్యులేరియా జింజిబెరిస్ అనే శిలీంధ్రాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు.

**నివారణ చర్యలు పాటించాలి...**

తెగులు నివారణకు ప్రొపికోనజోల్ లేదా టెబుకోనజోల్ మందులను లీటరు నీటికి ఒక మిల్లీలీటరు చొప్పున కలిపి పిచికారీ చేయాలని అధికారులు సూచించారు. విత్తన కొమ్ములకు తగిన విధంగా విత్తన శుద్ధి చేయాలన్నారు. మందుల వినియోగంలో స్థానిక ఉద్యాన శాఖ అధికారుల సలహాలు, ఉత్పత్తి లేబుల్‌పై సూచించిన మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.

తెగులు సోకిన ప్రాంతాల నుంచి విత్తన కొమ్ములను తీసుకురావద్దని, ఆరోగ్యకరమైన పంట నుంచి నాణ్యమైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు.

పొలాల్లో తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి, శాస్త్రీయ సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చని అధికారులు తెలిపారు.

## అక్రమ ఇసుక

# రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

- ట్రాక్టర్, ట్రాలీ స్వాధీనం.. ఒకరిపై కేసు నమోదు



**బెజ్జంకి, అక్టోబర్ 22 (జనంసాక్షి):** మండలంలోని గాగిల్లాపూర్ గ్రామ పరిధిలోని మోయతుమ్మెద వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్,ట్రాలీని బెజ్జంకి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేశారు.పోలీసుల వివరాల ప్రకారం.. గాగిల్లాపూర్‌కు చెందిన బామండ్ల లక్ష్మణ్ అలియాస్ లచ్చయ్య (55) మోయతుమ్మెద వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్ నంబర్ (టీఎస్ 36టి8994),ట్రాలీ నంబర్ (టీఎస్36టీ8996)లో లోడ్ చేసుకొని బెజ్జంకి వైపు తరలిస్తుండగా,గురువారం ఉదయం 11.45 గంటలకు బెజ్జంకి క్రాస్‌రోడ్డు సమీపంలోని కల్వర్టు వద్ద పోలీసులు తనిఖీ చేశారు.ఇసుక రవాణాకు అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు, రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై తోట తిరుపతి హెచ్చరించారు.

## తిరుమలపురం

# చెరువులో మహిళ మృతదేహం

**పెద్ద శంకరంపేట, అక్టోబర్ 22 (జనంసాక్షి):** పెద్దశంకరంపేట మండలం కోలపల్లి గ్రామానికి చెందిన పులబోయిన శంకరమ్మ వయస్సు 72 మృతి స్థానికంగా కలకలం రేపింది. మంగళవారం ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. చెరువు సమీపంలో చెప్పులు కనిపించడంతో పరిశీలించగా నీటిలో మృతదేహం కనిపించినట్లు సమాచారం. కుటుంబంలో గొడవ జరిగి మనస్తాపంతో వెళ్లినట్లు కోడలు ఫిర్యాదు పై కేసు నమోదు చేసి జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం మార్చురీకి పంపమని పేట ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు.

# గురుపీఠంలో ఘనంగా ప్రత్యేక హోమాలు



**శివ్వంపేట, అక్టోబర్ 22 (జనంసాక్షి):** శివ్వంపేట మండలం గూడూరు గ్రామ శివారులోని శ్రీ గురుపీఠంలో గురువారం ప్రత్యేక పూజలు, హోమాలు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాతో పాటు జంట నగరాల నుంచి వచ్చిన భక్తులు దత్తాత్రేయ, సాయిబాబా స్వాములను దర్శించుకున్నారు. గురుపీఠం ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ జిన్నారం పెద్దగౌని శివకుమార్ గౌడ్-రమాదేవి దంపతులు, ట్రస్ట్ సభ్యులు రాజం భిక్షపతి యాదవ్-మంజుల దంపతుల ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి, నవగ్రహ, దత్తాత్రేయ, సాయినాథ, గాయత్రి తదితర హోమాలు వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు, హారతులు, సత్సంగం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పూజారి నటరాజ శర్మ, ట్రస్ట్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# ఎంపీ సురేష్ షెట్కర్‌ను కలిసిన కోహీర్ కాంగ్రెస్ నాయకులు

- ఎంపీ క్యాంపు కార్యాలయంలో దసరా శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



**కోహీర్, అక్టోబర్ 22 (జనంసాక్షి):** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్‌ను కోహీర్ మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జహీరాబాద్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆయనకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు టి. సువర్ణ మల్లన్న పాటిల్‌తో పాటు పలువురు సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకుల మధ్య ఆత్మీయ వాతావరణం నెలకొంది. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. విజయదశమి ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు నింపాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

**అభివృద్ధికి సమన్వయం అవసరం...**

కోహీర్ మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని నాయకులు అభిప్రాయపడ్డారు. పండుగల సందర్భంగా జరిగే ఇలాంటి ఆత్మీయ సమావేశాలు నాయకుల మధ్య సంబంధాలను బలోపేతం చేసి, ప్రజాసేవలో కలిసి పనిచేయడానికి దోహదపడతాయని తెలిపారు.

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

# దేవస్థాన అభివృద్ధికి దంపతుల ఉదార సహకారం



**బెజ్జంకి, అక్టోబర్ 22 (జనంసాక్షి):** బెజ్జంకి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం రేకుల షెడ్డు నిర్మాణానికి పాపయ్యపల్లికి చెందిన శీలం నగేశ్--శారద దంపతులు ముందుకొచ్చారు.

మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య విజ్ఞప్తి మేరకు గురువారం గ్రామస్తుల సమక్షంలో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. దాతలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

### పంటల మద్దతు

## ధరలపై రైతులకు అవగాహన



**కోహెడ, అక్టోబర్ 22 (జనంసాక్షి):** కోహెడ వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద పత్తి, వరి పంటల కనీస మద్దతు ధరలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బోయిని నిర్మల-జయరాజు పాల్గొన్నారు.
రైతులు మద్దతు ధరలు, పత్తి విక్రయ విధానాలు, నాణ్యతా ప్రమాణాలు, మార్కెటింగ్ సదుపాయా లపై అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయ అధికారి సతీష్ సూచించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి సుధాకర్, వ్యవసాయ అధికారులు, రైతులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బూరుగుపల్లిలో యువకుడి ఆత్మహత్య



**పెద్ద శంకరంపేట, అక్టోబర్ 22 (జనంసాక్షి):** మండలంలోని బూరుగుపల్లికి చెందిన బోయిని సంగమేశ్వర్ (31) ఇంట్లో ఉరివేసుకొని మృతి చెందాడు. ఈ నెల 20న గేదెను తీసుకెళ్తుండగా పట్టుబడిన నేపథ్యంలో, మరుసటి రోజు గ్రామ పంచాయతీలో రూ.50 వేల జరిమానా విధించినట్లు మృతుడి అన్న ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసు కేసు నమోదవుతుందనే భయంతో మనస్తాపానికి గురై సంగమేశ్వర్ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## దుర్గామాత చీరల వేలం..

• రూ.2.25 లక్షల ఆదాయం





**కొల్చారం, అక్టోబర్ 22 (జనంసాక్షి):** మెదక్ జిల్లా కొల్చారం మండలం కోనాపూర్ గ్రామంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాతకు భక్తులు సమర్పించిన చీరలను బుధవారం రాత్రి వేలం వేశారు. ఈ వేలం ద్వారా రూ.2.25 లక్షల ఆదాయం వచ్చినట్లు దుర్గామాత కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామస్తులు, భక్తులు ఉత్సాహంగా వేలంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సంతోష్ రావు, సర్పంచ్ మోత్కు నిర్మల మల్లేశం, ఉపసర్పంచ్ మురళి రావు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

### ఇంగాల నాగమల్లేశం

## కుటుంబానికి బీఆర్ఎస్ నేతల పరామర్శ



**బెజ్జంకి,అక్టోబర్ 22(జనంసాక్షి):** మండలంలోని రాంసాగర్ గ్రామ సర్పంచ్ ఇంగాల లక్ష్మి భర్త, మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ ఇంగాల నాగమల్లేశం ఇటీవల మృతి చెందడంతో, ఆయన కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి,రాష్ట్ర నాయకుడు లింగాల లక్ష్మణ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చు రాజయ్య,జిల్లా నాయకుడు దీటి రాజు,మండల యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఘనపురం తిరుపతి,గుజ్జుల రామారావు,ఇంగాల సంజీవరావు,ఆడుకని బుచ్చయ్య,ఆడుకని రవి, ఇంగాల మల్లేశం, ఇంగాల మహేందర్,ఇంగాల సత్తయ్య,మెంగని ప్రభాకర్ పాల్గొన్నారు.

# బాచేపల్లిలో మూడు ప్రారంభోత్సవాలు... ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి







**నిజాంపేట్, అక్టోబర్ 21 (జనంసాక్షి):** నిజాంపేట్ మండలం బాచేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం, సమైక్య భవనం, వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవాలు ఘనంగా నిర్వహించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మూడు కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

### ఆగడాలను

## ఎదిరించి.. పేదల పక్షాన నిలిచి



**పాపన్నపేట, అక్టోబర్ 22 (జనంసాక్షి):** నిజాం రజాకార్ల ఆగడాలను ఎదిరించి,పేద ప్రజల ఆకలి తీర్చిన గొప్ప వ్యక్తి తెలంగాణ రాబిన్ హుడ్ పండుగ సాయన్న అని ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు ముసెట్టి కిష్టయ్య పేర్కొన్నారు. గురువారం సాయన్న 174వ జయంతి సందర్భంగా పాపన్నపేటలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. భూస్వాముల దోపిడీ నుండి నిరుపేదలను రక్షించిన మహోన్నత వ్యక్తి సాయన్న అని సంఘం నాయకులు అన్నారు. ఉపాధ్యక్షుడు సత్యనారాయణ,యువజన విభాగం మండలాధ్యక్షుడు కిరణ్, నాయకులు సాయిలు, బాగయ్య తదితరులు పాల్గొన్నారు.

### పండుగ సాయన్న

## 174వ జయంతి ఘనంగా నిర్వహణ





**చేర్యాల, అక్టోబర్ 22 (జనంసాక్షి):** పండుగ సాయన్న 174వ జయంతిని పురస్కరించుకొని చేర్యాల పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా కార్యదర్శి యాట యాదగిరి, మత్స్యశాఖ అధ్యక్షుడు చెక్క మల్లేశం, పట్టణ అధ్యక్షుడు చింతల రవి, పాక కనకయ్య, పాక కృష్ణ, పుల్లన్నగారి రాజు తదితర సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

### నాగపూరిలో

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



**చేర్యాల, అక్టోబర్ 22 (జనంసాక్షి):** నాగపూరి గ్రామానికి చెందిన గోపరాజుపల్లి కనకయ్య ఆకస్మిక మరణం చెందగా వారి కుటుంబాన్ని గ్రామ పెద్దలు పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. గంగపుత్ర సంఘం రాష్ట్ర నాయకుడు చింతల వెంకయ్య రూ.5,000 తో పాటు గ్రామ పెద్దల సహకారంతో మొత్తం రూ.11,500 ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండమీది సంతోషి కరుణాకర్, చేర్యాల మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, నాగపూరి ఉప సర్పంచ్ ఆవుల సందీప్, వార్డు సభ్యులు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# వింత వ్యాధి బారిన వీధి కుక్కలు

• భయాందోళనలో ప్రజలు



**హత్నూర, అక్టోబర్ 22 (జనంసాక్షి):** హత్నూర మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు వింత వ్యాధి బారినపడి వికృత రూపంతో సంచరిస్తున్నాయి. అంతుచిక్కని వైరస్ సోకి బొబ్బలెక్కి చర్మం పుండుగా మారిన కుక్కలను చూసి ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.అంతుచిక్కని వ్యాధి సోకిన కుక్కలు విచ్చల విడిగా వీధుల్లో తిరుగుతుండటం వల్ల ఆ వ్యాధి ప్రజలకు సోకే ప్రమాదముందని జనంలో ఆందోళన వ్యక్తమవుతోంది. వైరస్ సోకిన కుక్కలను సురక్షిత ప్రాంతాలకు తరలించి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజలు సంబంధిత అధికారులు పశు వైద్యులు, ఇంచార్జి ఎంపీడీవో యూసుఫ్,గ్రామ పంచాయతీ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు



**టేక్మాల్, అక్టోబర్ 22 (జనంసాక్షి):** మండల పరిధిలోని ఎల్లంపల్లిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లంపల్లి నుంచి టేక్మాల్ చౌరస్తా మీదుగా భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. యువకులు ముదిరాజ్ జెండాలు చేతబూని, డీజే పాటలతో ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఎల్లంపల్లిలో ముదిరాజ్ సంఘం జెండాను ఆవిష్కరించి, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల ముదిరాజ్ మహాసభలో సంఘం మండల అధ్యక్షులు కంది మాణెయ్య మాట్లాడుతూ ముదిరాజ్ సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నిజాం పాలనలో ప్రజలపై జరిగిన దౌర్జన్యాలను ఎదిరించి, పేదలకు అండగా నిలిచిన గొప్ప వ్యక్తి పండుగ సాయన్న అని వక్తలు కొనియాడారు. ముదిరాజులు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు సంఘటితంగా పనిచేయాలని సూచించారు.ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా ఐక్యత చాటి స్వజాతి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు.
ముదిరాజులకు రిజర్వేషన్ ఫలాలు పూర్తి స్థాయిలో అందేలా బీసీ-డీ నుంచి బీసీ-ఏ గ్రూపులోకి మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### మాట నిలబెట్టుకున్న

## చిట్లంకుంట 4వ వార్డు మెంబర్ బిలవత్ చంద్రు

• ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయానికి గిన్నెల పంపిణీ



**అచ్చంపేట, అక్టోబర్ 22 (జనంసాక్షి):** స్థానిక ఎన్నికల ప్రచార సమయంలో ఎస్సీ కాలనీ ప్రజలు తమ ప్రాంతంలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయానికి గిన్నెలు అవసరమని కోరారు. ఎన్నికల్లో గెలిచిన అనంతరం ఆలయానికి గిన్నెలు అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రజల విజ్ఞప్తికి స్పందించిన చిట్లంకుంట గ్రామ 4వ వార్డు మెంబర్ బిలవత్ చంద్రు, తాను ఇచ్చిన మాట ప్రకారం శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయానికి గిన్నెలను పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలు కోరిన అవసరాన్ని గుర్తించి, హామీని నెరవేర్చడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# పండుగ సాయన్న ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

## అన్యాయంపై పోరాటమే పండుగ సాయన్నకు నిజమైన నివాళి: సబ్ కలెక్టర్ ఉమా హారతి

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 22 (జనంసాక్షి):** అణగారిన, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పండుగ సాయన్న సాగించిన పోరాటం, ఆయన ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్, ఇన్‌చార్జి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఉమా హారతి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో పండుగ సాయన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉమా హారతి, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..**

ఆనాటి భూస్వాములు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా పండుగ సాయన్న వీరోచితంగా పోరాడారని కొనియాడారు. సామాజిక అసమానతలు, అన్యాయాలను ఎదిరిస్తూ ప్రజల పక్షాన నిలిచిన ఆయన పోరాట స్ఫూర్తి తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. పండుగ సాయన్న ఒక వర్గానికే పరిమితం కాకుండా అన్ని వర్గాల ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని యువత సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.





ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జగదీశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### టీఆర్ఎస్ బెజ్జంకి

# మండల అధ్యక్షుడిగా మహేందర్



**బెజ్జంకి, అక్టోబర్ 22 (జనంసాక్షి):** తెలంగాణ రక్షణ సేన బెజ్జంకి మండల అధ్యక్షుడిగా చీలాపూర్‌పల్లికి చెందిన ఎర్రవెల్లి మహేందర్‌ను నియమించినట్లు మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమల్ల చైతన్య తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా పోర్ల రమేష్, సంఘటన కార్యదర్శిగా సొల్లు ఆంజనేయులు, కోశాధికారిగా కొంపల్లి మధు, సంయుక్త కార్యదర్శిగా అంజుమల్ల బాబు నియమితులయ్యారు. రైతు విభాగం నాయకుడిగా దేవరాజు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా సొల్లు తారను నియమించారు.

తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

# చింతల్‌గట్టులో వైభవంగా దుర్గామాత శోభాయాత్ర





**కోహీర్, అక్టోబర్ 22 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం చింతల్‌గట్టు గ్రామంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు మంగళహారతులు సమర్పించారు. కోలాటాలు, భక్తి గీతాలు, అమ్మవారి నామస్మరణలతో గ్రామ వీధులు మార్మోగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దుర్గామాత ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. శోభాయాత్రతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, ప్రజల్లో భక్తి భావం, ఐకమత్యం మరింత పెరిగాయని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

### ఎమ్మెల్యేలకు దసరా

# శుభాకాంక్షలు తెలిపిన దాసరి కరుణాకర్ రెడ్డి





**రామచంద్రాపురం,అక్టోబర్ 22(జనంసాక్షి):** బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాసరి కరుణాకర్ రెడ్డి గురువారం పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డిలను వారి నివాసాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు కరుణాకర్ రెడ్డి తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

### 27,28న పిఎం శ్రీ

# పాఠశాలల జిల్లాస్థాయి క్రీడా పోటీలు

- **డిఈఓ గోవిందరాజు**

**నారాయణపేట, అక్టోబర్ 22(జనంసాక్షి):** నారాయణపేట జిల్లాలోని పీఎం శ్రీ పాఠశా లల విద్యార్థులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఈ నెల 27,28 తేదీల్లో నారాయణపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదా నంలో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి గోవింద్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు.విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, శారీరక దృఢత్వం,జట్టుగా పనిచేసే నైపుణ్యాలు, ఆరోగ్యకరమైన పోటీత త్వాన్ని పెంపొందించడం ఈ పోటీల ప్రధాన ఉద్దేశ్యం అన్నారు.అక్టోబర్ 27న బాలుర ఖో-ఖో, బాలికల ఖో-ఖో, బాలుర వాలీబాల్ పోటీలు నిర్వహించను న్నారు. ఖో-ఖో బాలుర,బాలికల జట్లలో ఎనిమిది మంది చొప్పున, వాలీబాల్ బాలుర జట్టులో ఎనిమిది మంది విద్యార్థులు పాల్గొం టారు.అక్టోబర్ 28న బాలుర కబడ్డీ, బాలికల కబడ్డీ, బాలికల వాలీబాల్ పోటీలు నిర్వహించను న్నారనీ తెలిపారు.ఈ మూడు విభాగాల్లోనూ ఒక్కో జట్టుకు ఎనిమిది మంది విద్యార్థులు పాల్గొ నేలా ఏర్పాట్లు చేయాలనీ సూచించారు.సంబంధిత పి ఎం శ్రీ పాఠశాలల ప్రధానో పాధ్యాయులు విద్యార్థుల ను ముందుగానే ఎంపిక చేసి, తగిన సాధన కల్పిం చాలి. నిర్ణీత తేదీల్లో విద్యా ర్థులు క్రీడా దుస్తులు, అవస రమైన సామగ్రితో పోటీలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.విద్యార్థుల భద్రత, క్రమశిక్షణ,సమయపాలనకు ప్రాధా న్యం ఇవ్వాలన్నారు.ఈ క్రీడా పోటీల నిర్వహణకు ఎస్ జి ఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డికార్యక్రమ సమన్వయకర్తగా వ్యవ హరిస్తారనీ తెలిపారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే సామర్థ్యం,నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని అన్నారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో వ్యవహరించి, క్రీడా పోటీల విజయవంతం చేయాలని కోరారు.

# మాజీ మంత్రి హరీశ్‌రావుకు దసరా శుభాకాంక్షలు

## బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్

**గుమ్మడిదల, అక్టోబర్ 22 (జనంసాక్షి):** విజయదశమి పండుగను పురస్కరించుకుని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావును బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావుకు దసరా శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు.

విజయదశమి పర్వదినం ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు నింపాలని వారు ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు, అభివృద్ధి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావుతో ఆత్మీయంగా ముచ్చటించి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు చక్రపాణి, కుమార్ గౌడ్, హుస్సేన్, వెంకట్ రామ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, శేఖర్ రెడ్డి, మహేష్, ఫయాజ్ తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# కిష్టాపూర్ పీఏసీఎస్ భవన నిర్మాణానికి భూమిపూజ



## చైర్మన్ నాగులగారి మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో పనులకు శ్రీకారం

**కౌల్చారం, అక్టోబర్ 22 (జనంసాక్షి):** మెదక్ జిల్లా కౌల్చారం మండలం కిష్టాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన భవన నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించి పునాదిరాయి వేశారు. ఎన్నో ఏళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతున్న సంఘానికి సొంత భవనం నిర్మించాలనే లక్ష్యంతో చైర్మన్ నాగులగారి మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా చైర్మన్ మల్లేశం గౌడ్ మాట్లాడుతూ.. 2020లో సంఘ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. గత రెండేళ్ల క్రితం సంఘానికి గుంట భూమిని కొనుగోలు చేశామని, ప్రస్తుతం ఆ స్థలంలో సంఘ నిధుల నుంచి కొంత మొత్తాన్ని వినియోగించుకునేలా తీర్మానం చేసి, అందరి సహకారంతో నూతన భవన నిర్మాణాన్ని ప్రారంభించినట్లు వివరించారు. ఇన్నాళ్లూ సొంత భవనం లేక అద్దె భవనంలో సంఘ కార్యకలాపాలు నిర్వహిస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, నూతన భవన నిర్మాణంతో ఆ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వప్న ఉషయ్య, సంఘం సీఈఓ నవీన్, వైస్ చైర్మన్ ప్రభాకర్, పాలకవర్గ సభ్యులు పసుల నారాయణ, పసుల సత్యనారాయణ, సార డాకా గౌడ్, చిట్యాల పోచయ్య, వార్డు సభ్యులు పెద్దల కిషన్, ఏంబరీ మల్లేశం, అక్కెమ్ ప్రవీణ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ది శ్రీశైలం, గ్రామ పెద్దలు, రైతులు, సంఘ అటెండర్ యాదగిరి పాల్గొన్నారు.

నూతన భవన నిర్మాణానికి సహకరించిన సీఈఓ, పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యులు, రైతులకు చైర్మన్ మల్లేశం గౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# కోహెడలో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు

- **మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శెట్టి సుధాకర్ పటేల్**

**కోహెడ, అక్టోబర్ 22 (జనంసాక్షి):** మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి వేడుకలను అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించారు. మండల అధ్యక్షుడు శెట్టి సుధాకర్ పటేల్, కాంగ్రెస్ నాయకులు, ముదిరాజ్ సంఘం సభ్యులు సాయన్న చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ పటేల్ మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన ప్రజావీరుడు పండుగ సాయన్న అని కొనియాడారు. సాయన్న జయంతిని తొలిసారిగా అధికారికంగా నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బోయిని నిర్మల, జయరాజు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



# విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు, తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు: ఎస్పీ వినీత్



నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 22(జనంసాక్షి): నారాయణపేట జిల్లా పరిధిలో సామాజిక మాధ్య మాల ద్వారా విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, తప్పుడు ప్రచారం నిర్వ హించడం, కుల, మత, ప్రాంతీయ విభేదాలను ప్రోత్సహించడం, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా పోస్టులు చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసు కుంటామని జిల్లాఎస్పీ డాక్టర్ వినీత్ హెచ్చరించారు. ఈ సందర్భం గా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్ స్టాగ్రామ్, వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాల్లో సమాజంలో అశాంతిని సృష్టించేలా, ప్రజల మధ్య విద్వేషాలను పెంచేలా, ఒక వర్గాన్ని కించపరిచేలా ఉన్న పోస్టులు, ఫొటోలు, వీడియోలను ప్రచారం చేయడం, ఇతరులకు ఫార్వర్డ్ చేయ డం చట్టరీత్యా నేరమని తెలిపారు. ముఖ్యంగా, వాటి నిజానిజాలు తెలుసు కోకుం డా ఇతరుల నుంచి వచ్చిన పోస్టులను షేర్ చేయడం, ఫార్వర్డ్ చేయడం వల్ల చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాలను ప్రజలకు ఉపయోగపడే మంచి కార్య క్రమాల కోసం వినియోగించుకోవాలని, వ్యక్తిగత దూషణలు, విద్వేష పూరిత వ్యాఖ్యలు, అసత్య ప్రచారాలకు వేదిక గా మార్చుకోవద్దని సూచిం చారు. సోషల్ మీడియా గ్రూపుల్లో అభ్యంతరకర రమైన, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పోస్టు లు వ్యాప్తి చెందకుండా గ్రూప్ అడ్మిన్లు అప్రమత్తం గా ఉండాలని తెలిపారు. నేర స్వభావాన్ని, సంబంధి త వ్యక్తుల పాత్రను బట్టి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.జిల్లాలో సామాజిక మాధ్యమాలపై పోలీసుల ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిని నిరంతరం పర్యవే క్షించాలని పోలీసు అధికా రులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు పెట్టినా, ఇతరులకు ఫార్వర్డ్ చేసినా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సమాజంలో శాంతి, సామరస్యాలను కాపా డేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

## శనగ విత్తనాలపై 50 శాతం సబ్సిడీ

- 16 కిలోల బ్యాగ్ ధర రూ.752
- మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి



కొల్హారం, అక్టోబర్ 22 (జనంసాక్షి): యాసంగి (రబీ) సీజన్‌లో శనగ పంట సాగుచేసే రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వ ర్యంలో 50 శాతం సబ్సిడీపై శనగ విత్త నాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి తెలిపారు. 16 కిలోల శనగ విత్తనాల బ్యాగ్‌కు రైతు చెల్లించా ల్సిన ధర రూ.752గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. విత్తనాల లభ్యత, పంపిణీ విధానం, అవసరమైన పత్రాల వివరాల కోసం రైతులు తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారిని లేదా మం డల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నాణ్యమైన విత్తనాలతో సకా లంలో పంట సాగు చేపట్టి మంచి దిగుబడులు సాధించాలని శ్వేత కుమారి కోరారు.

## ఆత్మకూరులో ఘనంగా పండుగల సాయన్న జయంతి వేడుకలు



ఆత్మకూర్, అక్టోబర్ 22 (జనం సాక్షి): ఆత్మకూరు మున్సిపాలిటీ గాంధీ చౌరస్తాలో పండుగల సాయన్న ముదిరాజ్ 174వ జయంతి వేడుకలను మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన పోరాటాలు, సేవలను నాయకులు స్మరించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం అధ్య క్షుడు అశ్విన్ కుమార్, నాగరాజు, బుద్ధరాజు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## జరిమానా తీర్పుతో మనస్తాపం.. వ్యక్తి ఆత్మహత్య



పెద్దశంకరంపేట, అక్టోబర్ 22 (జనంసాక్షి): మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలం బూర్గుపల్లి లో గేదె దొంగతనం కేసులో పంచాయతీ విధించిన జరిమానాతో మనస్తాపానికి గురై బోయిని సంగ మేశ్వర్ (31) ఆత్మహత్య చేసు కున్నాడు. మంగళవారం రాత్రి కోటప్పకు చెందిన గేదెను దొంగి లిస్తూ పట్టుబడిన సంగమేశ్వర్‌కు బుధవారం గ్రామ పంచాయతీ రూ.50 వేల జరిమానా విధించింది. డబ్బులు చెల్లించలేక, పోలీసు కేసు అవుతుందనే ఆందోళనతో ఇంట్లో ఉరివేసుకున్నాడు. మృతుడి అన్న దత్తు ఫిర్యాదుతో ఎస్సై ప్రవీణ్‌రెడ్డి విచారణ చేపట్టి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జోగిపేట ఆసుపత్రికి తరలించారు.

## గోపాలపేట పాఠశాలలో క్రీడా పరికరాలకు ఆయుధపూజ



గోపాలపేట, అక్టోబర్ 23 (జనంసాక్షి): పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ గోపాల పేటలో దసరా సందర్భం గా క్రీడా పరికరాలకు ఆయుధపూజ నిర్వహిం చారు. ఫుట్‌బాల్, వాలీ బాల్, క్రికెట్, కబడ్డీ, అథ్లెటిక్స్ పరికరాలకు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు జిల్లెల్ల సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి క్రీడలు ఎంతో ముఖ్య మన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. సీనియర్ క్రీడాకారుడు రవి, ఫుట్‌బాల్ కోచ్ సందీప్ విద్యార్థులను ప్రోత్సహించారు. క్రమశిక్షణతో సాధన చేస్తే ఉన్నత స్థాయికి చేరవచ్చన్నారు.

## అమరచింతలో ఘనంగా పండుగ సాయన్న జయంతి



అమరచింత, అక్టోబర్ 22 (జనంసాక్షి): అమర చింత మత్స్య కార్మిక సహకార సంఘం ఆధ్వ ర్యంలో గురువారం సం ఘ భవనంలో పండుగ సాయన్న జయంతి నిర్వ హించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన సాయన్న సేవలను సంఘం అధ్యక్షుడు టి.రవికాంత్ స్మరించుకున్నారు. జయంతిని అధికారికం గా గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ఆశయా లను భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు టి. గోపాల్, ఉపాధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, కార్యదర్శి జి. శ్రీనివాస్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా అష్ఫాఖుల్లా ఖాన్ జయంతి వేడుకలు



గద్వాల, ఆగస్టు 22 (జనంసాక్షి): ఆవాజ్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు అతికూర్ రెహమాన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు షహీ ద్ అష్ఫాఖుల్లా ఖాన్ 127వ జయంతి నిర్వహించారు. ఈ సంద ర్భంగా అతికూర్ రెహమాన్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం కేవలం 27 ఏళ్ల వయసులో ప్రాణత్యాగం చేసిన గొప్ప దేశభక్తుడు అష్ఫా ఖుల్లా ఖాన్ అని కొనియాడారు. ఆవాజ్ రాష్ట్ర సభ్యుడు ముహమ్మద్ రహమతుల్లా ఆయన విప్లవ పోరాటాలను వివరిం చారు. కార్యక్రమంలో ఆవాజ్ సభ్యులు షరీఫ్, హమీద్, రఫీ, ఇస్మాయిల్, సులేమాన్, నవీద్, ఉస్మాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాబా పిలుపుతో పుస్తకావిష్కరణ



సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 22 (జనంసాక్షి): జర్నలిస్టు కల్వల మల్లికార్జున్‌రెడ్డి రచించిన 'బాబా పిలుపుతో' పుస్తకాన్ని గురువారం సంగారెడ్డి ప్రశాంత్‌నగర్ సాయిబాబా ఆలయంలో ఆవిష్కరించారు. 2023లో రచయిత దంపతులు సంగారెడ్డి నుంచి షిరిడీ వరకు 16 రోజులపాటు చేసిన పాదయాత్ర అనుభవాలు, సాయిబాబా లీలలను ఇందులో వివరించారు. ఆలయ నిర్వాహకులు మల్లికార్జున్‌రెడ్డి, లతాశ్రీ దంపతులను సన్మానించారు. పాదయాత్ర అనుభవాలను భక్తులతో పంచుకున్న రచయిత, బాబా అను గ్రహంతోనే పుస్తకాన్ని అందించగలిగానని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పూజారి బసవరాజు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డిప్యూటీ డిఎంహెచ్వో



మల్దకల్, అక్టోబర్ 22 (జనంసాక్షి): జోగులాంబ గద్వాల జిల్లాడిఎం హెచ్ ఓ డా.సంధ్యా కిరణ్మయి ఆదేశాల మేరకు, జిల్లాఉప వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అస్గర్ అలీ మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సమీక్షించి, వాటి అమలు తీరును పరిశీలించారు. టీకాలకు సంబంధించి పోర్టల్‌లో నమోదు, సెషన్ల నిర్వహణ,వ్యాక్సినేషన్ రికార్డులను తనిఖీ చేశారు. కుటుంబ నియంత్రణ సేవలు,అర్హులైన దంపతులకు అవగాహన కల్పించడం,తగిన కుటుంబ నియంత్రణ పద్ధతులపై సలహాలు అందించడం వంటి అంశాలను సమర్థవంతంగ అమలు చేయాలని సూచించారు. క్షయవ్యాధి, కుష్టువ్యాధి ఇతర జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును సమీక్షించి, అనుమానిత కేసులను గుర్తించి, అవసరమైన పరీక్షలు నిర్వహించి, బాధితులకు సకాలంలో చికిత్స అందించాలని సూచించారు. వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ, క్షేత్రస్థాయిలో కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఆయన వెంట డిపిఎల్ ఎం నరేంద్రబాబు, పి హెచ్ ఎన్ తిర్మలరాణి పాల్గొన్నారు.

## నేల ఆరోగ్య పరిరక్షణతోనే సుస్థిర వ్యవసాయం

- రైతులకు ఖేత్ బచావో అభియాన్‌పై అవగాహన



గుండుమాల్, అక్టోబర్ 22 (జనంసాక్షి): గుండుమాల్ మండలంలోని భోగారం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎడిఎ నూతన్ కుమార్ రైతులకు నేల ఆరోగ్య పరిరక్షణ, భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల విని యోగం, ప్రకృతి వ్యవసాయం, పంట అవశేషాల నిర్వహణపై అవగాహన కల్పిం చారు. సమగ్ర పోషక యాజమాన్యం, సమ గ్ర సస్యరక్షణ, భూసార ఆరోగ్య కార్డుల వినియోగం, నీటి సంరక్షణ, వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయం, పంటల వైవిధ్యీకరణతో పాటు సుస్థిర వ్యవ సాయ పద్ధతుల ప్రాముఖ్యతను వివరిం చారు. రైతులు నేలసారాన్ని కాపాడుకుంటూ, ఎరువులను సమతుల్యంగా వినియోగించా లని సూచించారు. నీటిని పొదుపుగా వాడుతూ సాగు ఖర్చులను తగ్గించుకోవా లని, ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించి పంటల దిగుబడితో పాటు నికర ఆదాయాన్ని పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారిణి రేష్మ తో పాటు వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## యాప్ ద్వారా అమ్మకాలు చేపట్టాలి



పాపన్నపేట, అక్టోబర్ 22 (జనంసాక్షి): రైతులకు ఎరువులను తప్పనిసరిగా ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారానే అమ్మకాలు చెప్పటాలని జిల్లా వ్యవసాయాధికారి దేవ్ కుమార్ సూచించారు. గురువారం పాపన్నపేటలో ఎరువుల దుకా ణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లు, గోదాములను పరిశీలించి మాట్లాడారు. డీలర్స్ రిజిస్టర్లు తప్పకుండా సక్రమంగా నిర్వహించాలని,వరి విత్తనాలు సాధ్యమైనంత వరకు అమ్మ కాలు చేయరాదన్నారు. అక్రమాలకు పాలుపడిన లైసెన్స్ డీలర్లపై తగుచర్యలు ఉంటాయన్నారు. మండల వ్యవ సాయాధికారి శ్రీనివాస రాజు,ఏఈవో లు ఆసిఫ్,సంతోష్ కుమార్ ఉన్నారు.

# పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా ఆన్‌లైన్ పోటీలు

• విద్యార్థులు, పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొనాలి: ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 22 (జనంసాక్షి):** పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకుంటూ తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. పోలీసు సేవలు, ప్రజా భద్రత, నేరాల నివారణపై అవగాహన పెంపొందించడంతో పాటు సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, పోలీసు సిబ్బంది, ప్రజలు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

**విద్యార్థులకు వ్యాసరచన పోటీలు...**

ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీ ఆపై చదువుతున్న విద్యార్థులు తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో వ్యాసరచన పోటీల్లో పాల్గొనవచ్చు. వ్యాసం 500 పదాలకు మించకూడదు. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైబర్ నేరాల నివారణలో పోలీసులు, పౌరుల పాత్ర; మాదకద్రవ్యాల నివారణలో పోలీసుల పాత్ర, వాటికి విద్యార్థులు ఎలా దూరంగా ఉండాలనే అంశాలను కేటాయించారు. డిగ్రీ ఆపై విద్యార్థులకు సామాజిక మాధ్యమాల దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర, తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో తమ పాత్ర అనే అంశాలున్నాయి. ఆసక్తిగల విద్యార్థులు ఈ లింక్ ద్వారా నమోదు చేసుకుని, వ్యాసాన్ని ఫొటో లేదా పీడీఎఫ్ రూపంలో అప్‌లోడ్ చేయాలి. చివరి తేదీ అక్టోబర్ 28.

**లఘుచిత్రాలు, ఫొటోగ్రఫీ పోటీలు...**

తెలంగాణ పౌరులు పోలీసు సేవలు, ప్రజా భద్రత, నేరాల నివారణ, పోలీసు అమరవీరుల త్యాగాలు తదితర అంశాలపై గరిష్ఠంగా మూడు నిమిషాల నిడివి గల లఘుచిత్రాలను సమర్పించవచ్చు. జిల్లా స్థాయిలో ఎంపికైన మూడు ఉత్తమ చిత్రాలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తారు. సమాజ భాగస్వామ్యంతో పోలీసింగ్, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజాసేవ, నేరాల నివారణ, పోలీసుల విధులకు సంబంధించిన ఫొటోలను కూడా పంపవచ్చు. ఎంపికైన వారికి ప్రతిభా ధ్రువపత్రాలు అందజేస్తారు. లఘుచిత్రాలు, ఫొటోగ్రఫీ ఎంట్రీలను https://forms.gle/gVpPmmWFrWZNNRBF6ఈ లింక్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. చివరి తేదీ అక్టోబర్ 30.

## కొమురం భీమ్‌కు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘన నివాళి

• జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు జి.అంజయ్య



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 22 (జనంసాక్షి):** జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కొమురం భీమ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు జి.అంజయ్య, కార్యదర్శి ఎం. మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. 'జల్-జంగల్-జమీన్' నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన విప్లవ వీరుడు కొమురం భీమ్ అని, గిరిజన ఆత్మగౌరవానికి ఆయన ప్రతీకగా నిలిచారని కొనియాడారు. ఆదివాసీల హక్కుల సాధన కోసం ఆయన సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు అధిక సంఖ్యలో పాల్గొని కొమురం భీమ్‌కు నివాళులర్పించారు.

## కేటీఆర్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన బర్కం గణేష్



**వెల్దండ, అక్టోబర్ 22 (జనంసాక్షి):** తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కేటీఆర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు అనంతరం వెల్దండ మండల పరిధిలోని రాఘాయిపల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు బర్కం గణేష్ కేటీఆర్‌ని శాలువలతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

## చేర్యాలలో ఘనంగా పండుగ సాయన్న జయంతి



**చేర్యాల,అక్టోబర్ 22 (జనంసాక్షి):** చేర్యాల పట్టణంలో పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాపరెడ్డి సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జమీందార్లు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి, అణగారిన వర్గాలకు అండగా నిలిచిన గొప్ప యోధుడు సాయన్న అని కొనియాడారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, మంజె మల్లేశం, మహాదేవుని శ్రీనివాస్, దాసరి శ్రీకాంత్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వరిగుంతంలో ఘనంగా దుర్గాభవాని శోభాయాత్ర



**కొల్చారం, అక్టోబర్ 22 (జనంసాక్షి):** మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతంలో దుర్గాభవాని హనుమాన్ కమిటీ ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. హనుమాన్ టెంపుల్ నుంచి పోచమ్మ గుడి వరకు అమ్మవారి శోభాయాత్ర చేపట్టారు. మహిళలు, యువకులు కోలాటాలు, దాండియా నృత్యాలతో సందడి చేశారు. ఉత్సవాల్లో ఐదు కిలోల లడ్డూను అరిగే కిష్టయ్య రూ.69 వేలకు వేలంలో దక్కించుకున్నారు. లక్కీ డ్రాలో విజేతలకు వెండి లక్ష్మీదేవి విగ్రహం, కిలో లడ్డూ అందజేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై అల్లం లోడు లారీ బోల్తా

• తప్పిన ప్రాణాపాయం



**ఎర్రవల్లి, అక్టోబర్ 22 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం వేముల గ్రామ శివారులో గురువారం ఒక భారీ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. 44వ జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న ఒక లారీ అదుపుతప్పి రోడ్డుపైనే కుప్పకూలిపోయింది. స్థానికులు మరియు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ లారీ బెంగళూరు నుంచి తెలంగాణ రాజధాని హైదరాబాద్ వైపు అల్లం లోడుతో ప్రయాణిస్తోంది. ఎర్రవల్లి మండలం వేముల సమీపంలోకి రాగానే, లారీ అదుపు తప్పి ఒక్కసారిగా రహదారిపై బోల్తా పడింది. లారీ బోల్తా పడటంతో అందులోని అల్లం బస్తాలు రోడ్డు పై చెల్లాచెదురుగా పడిపోయాయి. అయితే, ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడినట్లు సమాచారం. ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే హైవే పోలీసులు, స్థానిక ఎర్రవల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. జాతీయ రహదారి కావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు వెంటనే స్పందించి, క్రేన్ సహాయంతో బోల్తా పడిన లారీని, రోడ్డుపై పడిన లోడును పక్కకు తొలగించారు. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, రాకపోకలను పునరుద్ధరించారు. పోలీసులు ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చిన్నముద్దనూరులో వ్యక్తి మృతి.. కేసు నమోదు

• వాటర్ ట్యాంక్ సమీపంలో విగతజీవిగా లైన్ ఇన్‌స్పెక్టర్



**తెలకపల్లి, అక్టోబర్ 22 (జనంసాక్షి):** వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. గురువారం సందర్భంగా ఎస్ఐ యం. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం. మండల పరిధిలోని చిన్నముద్దనూర్ గ్రామానికి చెందిన మూత్రమోని సైదులు (51), తండ్రి నరసింహ, అమ్రాబాద్ మండలంలో విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు భార్యలు ఉండగా, గత 26 సంవత్సరాలుగా రెండో భార్య రజితతో కలిసి నివసిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో చిన్నముద్దనూరు గ్రామంలోని వాటర్ ట్యాంక్ సమీపంలో సైదులు బోర్లా పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించగా, అప్పటికే సైదులు మృతిచెందినట్లు గుర్తించారు. ఈ ఘటనపై మృతుడి తల్లి మూత్రమోని సీతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ ఎం. రమేష్ తెలిపారు.

## తోటి టైలర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

**తెలకపల్లి, అక్టోబర్ 22 (జనంసాక్షి):** ఇటీవల మృతి చెందిన తోటి టైలర్ నామని గణేష్ కుటుంబానికి తెలకపల్లిలో పనిచేస్తున్న టైలర్ సోదరులు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. గణేష్ మృతిపట్ల విచారం వ్యక్తం చేసిన వారు, కష్టకాలంలో ఆయన కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సహాయం చేశారు. వృత్తిపరంగా కలిసి పనిచేస్తూ, ఆపద సమయంలో ఒకరికొకరు తోడుగా నిలవడం ఐకమత్యానికి నిదర్శనమని పలువురు పేర్కొన్నారు. గణేష్ కుటుంబానికి ఆర్థికంగా కొంత ఊరట కల్పించడంతో పాటు, తాము అండగా ఉన్నామనే భరోసా కల్పించిన టైలర్ సోదరుల మానవత్వాన్ని పలువురు అభినందించారు.

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



**కొడిపల్లి, అక్టోబర్ 22 (జనంసాక్షి):** పిల్లల పెళ్లిళ్ల కోసం చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురైన తాటి శంకరయ్య (55) ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా కొడిపల్లి మండలం బూర్గుగడ్డలో ఈ ఘటన జరిగింది. హైదరాబాద్ బిడీపీఎల్‌లో నివసించే శంకరయ్య దసరా సందర్భంగా స్వగ్రామానికి వచ్చాడు. అక్టోబర్ 22 తెల్లవారుజామున ఇంటి ఆవరణలోని జామ చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. కుటుంబసభ్యులు కిందికి దించినప్పటికీ అప్పటికే మృతి చెందాడు. భార్య భారతమ్మ ఫిర్యాదుతో ఎస్సై అమరేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కల్వరాలలో క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు



**వీపనగండ్ల, అక్టోబర్ 23 (జనంసాక్షి):** దసరా సందర్భంగా కల్వరాల గ్రామంలో మల్రి సరోజమ్మ స్మారక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గ్రామానికి చెందిన ఏడు జట్లు పాల్గొనగా లక్ష్మీ టీం ప్రథమ, సీనియర్స్ టీం ద్వితీయ బహుమతులు గెలుచుకున్నాయి. విజేతలకు వరుసగా రూ.6,000, రూ.4,000 నగదుతో పాటు షీల్డులు అందజేశారు. బహుమతుల ప్రదానోత్సవంలో మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, జిల్లా పర్యాటక అధికారి కల్వరాల నరసింహ, సరోజమ్మ కుమారుడు ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ బందారు రాముడు, కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీరంగాపురంలో ఘనంగా పండుగ సాయన్న జయంతి



**శ్రీరంగాపురం, అక్టోబర్ 22 (జనంసాక్షి):** మండల కేంద్రంలో మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతి నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు బాలచంద్రయ్య మాట్లాడుతూ పేదల పక్షాన పోరాడి జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప విప్లవ వీరుడు సాయన్న అని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విష్ణు ముదిరాజ్, సంఘ సభ్యులు సొప్పరి వెంకటయ్య, బొల్లెద్దుల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## యాసంగిలో ఆరుతడి పంటలు వేసుకోవాలి



- **జిల్లా హార్టికల్చర్ ఏడి రాజకుమార్**

**మల్దకల్, అక్టోబర్ 22 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని రైతు వేధిక భవనంలో గురువారం జిల్లా వ్యవసాయ అధికారి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎల్నినో ప్రభావం వలన రైతలు యాసంగిలో వరి పంటకు బదులుగా అరు తడి పంటలు వేసుకోవాలని సూచించారు. పత్తి కొనుగోలు కేంద్రాలు మన జిల్లాలో మూడు ఏర్పాటు చేయడం జరిగిందని, పత్తి క్వింటా 8667 రూపాయలు వరకు ఉంటుంది. నేలను ప్రతి ఒక్క రైతు కాపాడు కోవాలని, పచ్చిరొట్టె, పశువులు ఎరువు తప్పనిసరిగా ఉపయోగించాలని లేనిచో తక్కువ దిగుబడి వస్తుంది అని సూచించారు. నేలను కాపాడుదాం కార్యక్రమాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ ఏడి రాజ్ కుమార్, జిల్లామార్కెటింగ్ అధికారి పుష్ప, ప్రతాప్ కుమార్, ఉద్యాన శాఖ అధికారి రాజశేఖర్, మండల వ్యవసాయ అధికారి కే రాజశేఖర్, హెచ్ ఈ ఓ మెగారెడ్డి, వ్యవసాయవిస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ కిచెన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

### విద్యార్థులకు పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించాలి: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**మల్దకల్, అక్టోబర్ 22 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందించేందుకు నిర్మిస్తున్న కమ్యూనిటీ కిచెన్ భవన పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మల్దకల్ మండలం కుర్తి రావుల్ చెరువు గ్రామంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను గురువారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. వంటశాల నిర్మాణం, వంట యంత్రాల ఏర్పాటు, ఆహార పదార్థాల నిల్వ సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, భద్రతా ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా పూర్తికావాల్సిన పనులను గుర్తించి ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు.

తెలంగాణ స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం విద్యార్థుల ఆరోగ్యం, అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.



విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన అల్పాహారం అందించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలుచేయాలని తెలిపారు. కమ్యూనిటీ కిచెన్‌లో ఆహార తయారీ, నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

వంట యంత్రాలు సురక్షితంగా పనిచేసేలా, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. వంట చేసే ప్రదేశాలు, పాత్రలు, ఆహార పదార్థాల నిల్వ ప్రాంతాలు, పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. సురక్షిత తాగునీరు, మురుగునీటి పారుదల సదుపాయాలు కల్పించాలని చెప్పారు. వంటశాల సిబ్బందికి ఆహార



తయారీ, ఆహార భద్రత, వ్యక్తిగత పరిశుభ్రత, పరికరాల వినియోగం, నిర్వహణపై తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు.

కమ్యూనిటీ కిచెన్‌కు రాకపోకల కోసం అనుసంధాన సీసీ రోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనులను నిరంతరం పర్యవేక్షించాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, హెచ్‌కేఎం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఝాన్సీ రాణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ప్రజా యోధుడు పండుగ సాయన్న

- **అదనపు కలెక్టర్ శ్రీను**



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 22 (జనంసాక్షి):** నిరంకుశ పాలనకు, పెత్తందారులు, భూస్వాములు, జమీందారీ వ్యవస్థల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ ప్రజాయోధుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని నారాయణపేట జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా కలెక్టరేట్ లోని ప్రజా వాణి హాల్ లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పండుగ సాయన్న జయంతి వేడుకల సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీను పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలపై జరిగిన అణచివేతను ఎదిరించి, పేద ప్రజల సంక్షేమం కోసం పోరాడిన ధైర్యశాలి పండుగ సాయన్న అని కొనియాడారు. తెలంగాణ ప్రజా వీరుడిగా, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచి న పండుగ సాయన్న జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకర మని తెలిపారు. సమాజం లోని పేద ప్రజల కష్టాలను గుర్తించి, వారి సంక్షేమం కోసం కృషి చేయడంతో పాటు, ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని బడుగు, బలహీన వర్గాల అభ్యున్న తికి పాటుపడిన ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం పోరాడిన ఇలాంటి మహనీయుల జీవితాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజంలో సమానత్వం, సేవాభావం, పేదల పట్ల మానవత్వం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ పోషల్ రాజేష్, కలెక్టరేట్ ఏ వో అనిల్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, ముదిరాజ్ సంఘం నాయకులు గవినోళ్ళ శ్రీనివాస్, వకీల్ సంతోష్ కుమార్, ఆకుల బాలప్ప, కాకర్ల భీమయ్య, పోషల్ వినోద్, నర్సిములు, పాండు, ఎల్ ఐ సీ లక్ష్మణ్, మల్లేశ్, పోలేమోని గోవింద్, గౌని శీను, ఇతర సభ్యులు, ముదిరాజ్ యువజన సంఘం నాయకులు, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పంట అవశేషాలను కాల్చితే జరిమానా

- **జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్**

**నారాయణపేట, అక్టోబర్ 22 (జనంసాక్షి):** మండలం, సింగారం గ్రామంలో గురువారం రైతు వేదికలో నిర్వహించిన ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్ మాట్లాడుతూ ఇకపై పంట అవశేషాలను కాల్చితే పంచాయతీ పరిధిలో జరిమానా విధిస్తామని అన్నారు. పంటల అవశేషాలను కాల్చడం వల్ల భూసారం తగ్గుతుందని, నీటినిల్వ శాతం తగ్గుతుందని, గాలి కాలుష్యం పెరుగుతుందని . దీంతో పాటు హానికరమైన వాయువులు విడుదల అవుతాయని అన్నారు. కావున అవశేషాలను నేలలో కలపడం, పశువులకు మేతగా



వినియోగించాలని అన్నారు. అలాగే నీటి వనరులు లేనందున వరి పంట వద్దని, పంట మార్పిడి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దినకర్, మండల వ్యవసాయ కమిటీ కార్యదర్శి భారతి, ఏఈవోలు ప్రకాష్, రాజేష్, అనిల్, అంజమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మా ప్లాట్లు మాకు అప్పగించండి: గురుజాల బీసీ కాలనీ లబ్ధిదారుల విజ్ఞప్తి



**కృష్ణ, అక్టోబర్ 22(జనంసాక్షి):** గురుజాల గ్రామ బీసీ కాలనీకి కేటాయించిన ప్లాట్లను తమకు అప్పగించాలని లబ్ధిదారులు కోరారు. 1987లో సర్వే నంబర్ 157లోని 1.19 ఎకరాల భూమిని ప్రభుత్వం బీసీ కాలనీగా ఏర్పాటు చేసి 13 మందికి ప్లాట్లు పంపిణీ చేసిందని తెలిపారు. అయితే పోలీస్ పాటిల్ సిద్ధిలింగప్ప తమను బెదిరించి, ప్లాట్లలో వ్యవసాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు గురుజాల శివరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేసి, సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకుని ప్లాట్లు తమకు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బాలానగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి గ్రామ ప్రజల డిమాండ్!

### రహదారి, రైతులకు సురక్షిత మార్గం, మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని వినతి!



**బాలానగర్, అక్టోబర్ 22 (జనంసాక్షి):** మహబూబ్ నగర్ జిల్లా, బాలానగర్ మండలం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ గుమ్మల్ల వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు రైల్వే అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్టేషన్ అభివృద్ధితో పాటు ప్రయాణికుల సౌకర్యాలపై పలు కీలక అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

స్టేషన్‌కు మెరుగైన రహదారి నిర్మించాలి

బాలానగర్ (దీూదీ=) రైల్వే స్టేషన్‌కు గ్రామం నుంచి వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్టేషన్‌కు సులభంగా చేరుకునేలా మెరుగైన రహదారిని నిర్మించాలని కోరారు.

రైతులకు సురక్షిత మార్గం కల్పించాలి

రైల్వే ట్రాక్ అవతల ఉన్న వ్యవసాయ భూములకు వెళ్లేందుకు సరైన మార్గం లేక రైతులు, స్థానికులు తరచూ రైల్వే ట్రాక్ దాటాల్సి వస్తోందని వివరించారు. దీనివల్ల ప్రమాదాలకు అవకాశం ఉన్నందున, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అండర్‌పాస్ లేదా ప్రత్యామ్నాయ సురక్షిత మార్గాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

44వ జాతీయ రహదారి నుంచి బాలనగర్ రైల్వే స్టేషన్ కు వెళ్లే దారులకు సూచిక బోర్డ్స్ పెట్టాలని కోరారు,

మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలి

బాలానగర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడేలా మూడు ముఖ్యమైన రైళ్లకు బాలానగర్ స్టేషన్‌లో హాల్ట్ కల్పించాలని కోరారు.

17023 – తుంగభద్ర ఎక్స్‌ప్రెస్
17652 – చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్
17251 – గుంటూరు–కాచిగూడ ఎక్స్‌ప్రెస్

గ్రామ ప్రజల సమస్యలపై దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజన్ అధికారులు సానుకూలంగా స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుమ్మల్ల వెంకటేశ్వర్ రెడ్డి, , అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు శేఖర్, కళ్లెం శ్రీనివాస్, సాటి శ్రీనివాస్, సాయిలు, రొయ్యల సతీష్, నర్సింగ్, కురువ శ్రీను తదితర గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు..

## రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి



**చేర్యాల, అక్టోబర్ 22 (జనంసాక్షి):** రైతులకు, ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేర్యాల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ అంతరాయాలతో పంటలు ఎండిపోతున్నాయని, రైతులు పెట్టుబడులు కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు వెంటనే సమస్యలను పరిష్కరించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు

- జిల్లా న్యాయస్థానానికి హాజరైన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు



**మహమ్మదాబాద్, అక్టోబర్ 22 (జనంసాక్షి):** రైతు భరోసా పథకం అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ నిరసన తెలిపితే అక్రమ కేసులతో వేధిస్తారా?అంటూ బీఆర్ఎస్, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతుల పక్షాన గొంతెత్తిన నాయకులు, కార్యకర్తలపై మహమ్మదాబాద్ ఎస్ఐ, అక్రమంగా కేసులు నమోదు చేశారని,మాజీ జెడ్పీటీసీ ఎం,శ్రీనివాస్‌రెడ్డి ,మాజీ సర్పంచ్ పి.వెంకట్రామిరెడ్డి,బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.రైతు భరోసా పథకం అమలుపై బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఉమ్మడి గండీడ్ మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దేశాయిపల్లి ఎక్స్ రోడ్డు వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వారిపై ఈకేసులు నమోదయ్యాయని తెలిపారు.గురువారం మహబూబ్‌నగర్ జిల్లా న్యాయస్థానానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు,కార్యకర్తలు హాజరయ్యారు.ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం నేరమా? ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపితే కేసులతో గొంతు నొక్కుతారా?అని ప్రశ్నించారు.ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై కేసులు నమోదు చేయడం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు.ప్రజల పక్షాన పోరాడే తమ గొంతును అణచివేయలేరని స్పష్టం చేశారు.ఈకార్యక్రమంలో ఎం.శ్రీనివాస్‌రెడ్డి, పి.వెంకట్రామిరెడ్డి, జంగల్ల వెంకటయ్య,బోయిని కిష్టయ్య,డి.రఘు యాదవ్,అంగడి వెంకటయ్య,సూర్యనాయక్,నీలేష్ నాయక్,సాబేర్,జోగుశ్రీను,నరేష్,వెంకట్‌రెడ్డి,జె.భీమయ్య,కె.వెంకట్రాములు,రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయిలో జిల్లా ఖ్యాతిని నిలబెట్టాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల నడిగడ్డ,ఆగస్టు 22(జనంసాక్షి); జిల్లా క్రీడాకారులు తాము ఎంచుకున్న క్రీడల్లో ప్రతిభ చాటి జాతీయస్థాయిలో జోగులాంబ గద్వాల ఖ్యాతిని నిలబెట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకాంక్షించారు. మానవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని మధుప్రియ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన నేపథ్యంలో గురువారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించడం వలన మానసికంగా, శారీరకంగా ఉల్లాసంగా ఉండవచ్చన్నారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ చాటితే యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ క్రీడా కోటాలో రిజర్వేషన్స్ కల్పించడం జరుగుతోందన్నారు. మధుప్రియ వాలీబాల్‌తో పాటు ఇటీవల జరిగిన వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ బహుమతి కైవసం చేసుకోవడం అభినందనీయమన్నారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగబోయే జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లోనూ ప్రతిభ చాటి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఐఈఓ హృదయ రాజ్, కళాశాల ప్రిన్సిపల్ మంజుల, స్వప్న, విద్యార్థిని తల్లిదండ్రులు నాగార్జున, సోమేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

# మఖ్తల్‌లో ఘనంగా పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలు

- తెలంగాణ రాబిన్ హుడ్ సాయన్న జీవితం ఆదర్శనీయం: ముదిరాజ్ సంఘ నేతలు
- అధికారికంగా జయంతి నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేసిన నాయకులు



**మఖ్తల్, అక్టోబర్ 22 (జనంసాక్షి):** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన తెలంగాణ రాబిన్ హుడ్ పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను మఖ్తల్ పట్టణంలోని మత్స్య పారిశ్రామిక భవనంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా తొలుత పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి ఘనంగా సంబురాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘ నేతలు మాట్లాడుతూ.. పేద ప్రజల పాలిట దేవుడిగా నిలిచిన పండుగ సాయన్న, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. నాటి దొరల గడీలను బద్దలుకొట్టి, వారి సంపదను పేదవాళ్లకు పంచిపెట్టిన ఆయన త్యాగాలను స్మరించుకున్నారు. నేటికీ తెలంగాణ పల్లెల్లో పండుగ సాయన్న ధైర్యసాహసాలను కీర్తిస్తూ పాటలు పాడుకోవడం ఆయన జనబాహుళ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం చాలా సంతోషకరమని తెలిపారు. ఈ వేడుకల ఏర్పాటుకు విశేషంగా కృషి చేసిన మంత్రి వాకిటి శ్రీహరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మత్స్య పారిశ్రామిక సంఘం డైరెక్టర్లు తిరుపతి నర్సిములు, కర్ని గోపి, ముదిరాజ్ సంఘ నేతలు బైరంపల్లి ముసన్న తాత, మామిళ్ల బుగ్గప్ప, కావలి సాయిలు మేస్త్రి, కాకులారం అశోక్, మామిళ్ల పృథ్వీరాజ్, మామిళ్ల రాము, మామిళ్ల మొగులప్ప, ఈసరి క్రిష్ణ, ఈసరి వెంకటేష్ తో పాటు ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జడ్చర్లలో ఘనంగా పండుగ సాయన్న జయంతి



**జడ్చర్ల, అక్టోబర్ 22 (జనంసాక్షి):** పట్టణంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిగ్నల్ గడ్డ వద్ద సాయన్న చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్చర్లలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సొంత నిధులతో సాయన్న విగ్రహం ఏర్పాటు చేయడంపై సంఘం నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జయంతిని అధికారికంగా నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలతతో పాటు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఆసరా పెన్షన్‌లను రెట్టింపు చేయాలి

- కొత్త పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలి



**అమరచింత, అక్టోబర్ 22 (జనంసాక్షి):** అమరచింత మండల కేంద్రంలోని గురువారం నాడుతెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు యస్. అజయ్ డిమాండ్. ఆసరా పెన్షన్ల లబ్ధిదారులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు యస్. అజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆసరా పెన్షన్లను 2016నుంచి 4016.కు వికలాంగుల పెన్షన్లు 4016నుంచి 6016కు వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి డిసెంబర్ 9 కి మూడేళ్లు పూర్తి చేసుకోబోతున్న ప్పటికీ వృద్ధులు వికలాంగులు. చేనేత బీడీ కార్మికులు ఒంటరి మహిళలకు పెన్షన్లను రెట్టింపు చేస్తామన్న హామీ అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. అదేవిధంగా రెండు నెలల కిందట కొత్త పెన్షన్లకు నోటిఫికేషన్ విడుదల చేసి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తుల స్వీకరించి అర్హులను ఎంపిక చేసినప్పటికీ. ఈ దసరా పండగ నుంచి కొత్త పింఛన్ లు మంజూరు చేస్తామని చెప్పినప్పటికీ అది కూడా నెరవేరడం లేదని ప్రభుత్వ తీరును బాగాలేదన్నారు కొత్త పింఛన్ల దరఖాస్తులకు కూడా వృద్ధులకు బీడీ కార్మికులకు అవకాశం కల్పించకపోవడం సరైనది కాదని విమర్శించారు. వృద్ధులు బీడీ కార్మికులకు కూడా కొత్త పెన్షన్లకు దరఖాస్తులు తీసుకునే విధంగా ప్రభుత్వం జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో ఆసరా పెన్షన్ లబ్ధిదారులు సత్యమ్మ మక్బుల్ రాధా సుజాత కర్రెమ్మ చేన్నమ్మ పార్వతమ్మ బెక్కెం పద్మ సత్యవేనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మిడ్జిల్‌లో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు



**మిడ్జిల్, అక్టోబర్ 22 (జనంసాక్షి):** తెలంగాణ ప్రజావీరుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను మిడ్జిల్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా జయంతిని అధికారికంగా నిర్వహించడంపై ముదిరాజ్ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి గౌరవం తెలిపారు. ముదిరాజ్ సంఘం నాయకులు, యువకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నాయకులు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, పెత్తందారులు, భూస్వాముల నుంచి ఆస్తులను స్వాధీనం చేసుకుని పేదలకు పంచిన గొప్ప ప్రజావీరుడు పండుగ సాయన్న అని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. సాయన్న ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం జయంతిని అధికారికంగా నిర్వహించడం ముదిరాజ్ సమాజానికి గర్వకారణమని నాయకులు తెలిపారు. భవిష్యత్తులో హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు బహుజన వర్గాల ఐక్యత, ఆత్మగౌరవాన్ని చాటిచెప్పాయి. కార్యక్రమంలో పార్టీలకతీతంగా ముదిరాజ్ సంఘం నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన అమరచింత ఎస్సై కె.శేఖర్ రెడ్డి

- శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా విధులు నిర్వహించాలి.
- ప్రజల భద్రతే లక్ష్యంగా విధులు నిర్వహించాలి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్



**అమరచింత, అక్టోబర్ 22 (జనంసాక్షి):** ఆమరచింత పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన కె.శేఖర్ రెడ్డి గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ గారు నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవలు అందించాలని సూచించారు. అదేవిధంగా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల సమస్యల పరిష్కారంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదును బాధ్యతతో స్వీకరించి చట్ట ప్రకారం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసు శాఖ ప్రతిష్టను మరింత పెంపొందించేలా ప్రజల విశ్వాసాన్ని పొందే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు.

కె శేఖర్ రెడ్డి గతంలో మహబూబ్‌నగర్ జిల్లా రూరల్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ, తాజాగా బదిలీపై అమరచింత పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఇంతకుముందు అమరచింత ఎస్సైగా పనిచేసిన స్వాతి బదిలీపై వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లారు.

ఈ సందర్భంగా నూతన ఎస్సై శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించేందుకు కృషి చేస్తానని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ పోలీసుశాఖకు సహకరించి నేరరహిత సమాజ నిర్మాణానికి భాగస్వాములు కావాలని కోరారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



**అమీన్‌పూర్, అక్టోబర్ 22 (జనంసాక్షి):** పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని బీరంగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఈర్ల రాజు అన్నారు. విజయదశమి సందర్భంగా బీరం గూడ, అమీన్‌పూర్ డివిజన్ల పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు శుభాకాంక్షలు తెలిపి, పండుగ కానుకగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణం కోసం కార్మికులు అహర్నిశలు శ్రమిస్తున్నారని, వారి కృషికి సమాజం గౌరవం ఇవ్వాలని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కుంభమేళాలో పారిశుద్ధ్య కార్మికుల పాదాలు కడిగి వారి సేవలకు అత్యున్నత గౌరవం కల్పించారని గుర్తుచేశారు. అంత్యోదయ స్ఫూర్తితో చివరి వ్యక్తి వరకు సంక్షేమ ఫలాలు అందించడమే బీజేపీ లక్ష్యమన్నారు. భవిష్యత్తులో కార్మికులకు సహాయ సహకారాలు అందిస్తూ, వారి కుటుంబాలకు అండగా ఉంటానని, సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## వైద్య ఆరోగ్యశాఖ పోస్టులకు 24న అర్హత పరీక్షలు, 27న వాక్-ఇన్ ఇంటర్వ్యూలు

- **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 22(జనంసాక్షి);** వైద్య ఆరోగ్యశాఖలో వివిధ పోస్టుల భర్తీకి అర్హత పరీక్షలు, వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్న ట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఒక ప్రకటన లో తెలిపారు.అర్హులైన అభ్యర్థులు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం హాజరుకావాలని సూచించారు. వివిధ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 24వ తేదీన అర్హత పరీక్షలు నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు ఉదయం 10:00 గంటల నుంచి 10:30 గంటల వరకు,మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులకు మధ్యాహ్నం 1:00 గంటల నుంచి 1:30 గంటల వరకు,స్టాఫ్ నర్స్ పోస్టులకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 3:00 గంటల వరకు, ఏఎన్ఎం పోస్టులకు సాయం త్రం 4:00 గంటల నుంచి 4:30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ పోస్టులకు కేటాయించిన సమయాన్ని గమ నించి, నిర్ణీత సమయానికి పరీక్షలకు హాజరుకావా లని సూచించారు.

అదేవిధంగా, పల్లె దవాఖానల్లో పనిచేసేందుకు ఏం



ఎల్ పీహెచ్ ,సి హెచ్ ఓ ,ఏంఎ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న ఎంబీబీఎస్ ,బీఏఎంఎస్ అర్హత కలిగిన అభ్యర్థులకు ఈ నెల 27వ తేదీన ఉదయం 10:30 గంటలకు వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్న ట్లు తెలిపారు. ఈ ఇంటర్వ్యూలు గద్వాల పట్టణం లోని ఐడీఓసీ భవనం మొదటి అంతస్తులో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం, ఎఫ్ - 30లో నిర్వహించబడతాయి వెల్లడించారు. ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న అభ్యర్థులు తమ శాఖాధిపతి నుంచి పొందిన నిరభ్యంతర పత్రం తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు.

ఇదిలా ఉండగా, ఏం ఎల్ పీహెచ్ ,సి హెచ్ ఓ ,ఏంఎ, ఫిజిషియన్, ఫిజియోథెరపిస్ట్, ఓబీజీ స్పెష లిస్ట్, పీజీ అర్హత కలిగిన ఆయుష్ వైద్యులు, డైటీషియన్, సైకోసోషల్ కౌన్సిలర్, యోగా ప్రొఫెష నల్, సీనియర్ ట్యూబర్క్యులోసిస్ లాబొరేటరీ సూపర్‌వైజర్ తదితర పోస్టులకు సంబంధించిన మెరి ట్ జాబితాలను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో అందు బాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ పోస్టులకు దర ఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ పేర్లు,దరఖాస్తు వివరాలు మరియు మెరిట్ జాబితాలోని సమాచా రాన్ని అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించి ధృవీక రించుకోవాలని సూచించారు. అభ్యర్థులు పరీక్షలు, ఇంటర్వ్యూలకు హాజరయ్యే ముందు సంబంధిత సూచనలను జాగ్రత్తగా చదివి, అవసరమైన ధ్రువ పత్రాలను సిద్ధం చేసుకోవాలని అధికారులు తెలిపారు. పరీక్షలు, ఇంటర్వ్యూల తేదీలు, సమ యాలు, మెరిట్ జాబితాలు మరియు ఇతర వివరాల కోసం జిల్లా అధికారిక వెబ్‌సైట్‌ను https://gadwal.telangana.gov.in/ సందర్శించాలని సూచించారు.

## అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు పండుగ సాయన్న

**ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి: ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, అక్టోబర్ 22 (జనంసాక్షి):** అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన పండుగ సాయన్న ముదిరాజ్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం వనపర్తి ఐడీఓసీలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సాయన్న జయంతి వేడుకల్లో కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...** సాయన్న ధైర్యసాహసాలు, ప్రజాసంక్షేమం పట్ల నిబద్ధత, అణగారిన వర్గాల కోసం చేసిన పోరాటాలు చిరస్మరణీయమన్నారు. యువత ఆయన జీవిత చరిత్రను తెలుసుకుని అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.

**కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ...** సాయన్న ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సామాజిక సమా



నత్వం, ఐకమత్యం, ప్రజాసేవ వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. కళాకారుడు రాజా రామ్ ప్రకాష్ ఆలపించిన సాయన్న జీవిత చరిత్ర గీతం ఆకట్టుకుంది. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## జడ్చర్లలో చలో బ్రాహ్మణ శంఖారావం

- **భారీగా తరలిరావాలని సరిత గోవిందరావు పిలుపు**



**మక్తల్, అక్టోబర్ 22 (జనంసాక్షి):** ఈ నెల 25వ తేదీన జడ్చర్లలో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక చలో బ్రాహ్మణ శంఖారావం సభకు మక్తల్ నియోజకవర్గంలోని బ్రాహ్మణులందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని 13వ వార్డు కౌన్సిలర్ సరిత గోవిందరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సరిత గోవిందరావు మాట్లాడుతూ బ్రాహ్మణ వెనుకబడిన బ్రాహ్మణుల సమగ్ర అభివృద్ధి, సంక్షేమానికి అవసరమైన తగిన తోడ్పాటును అందించాలని కోరారు. బ్రాహ్మణ జాతి సంఘటితానికి, పరస్పర సహకారానికి బలమైన పునాది వేయాలి. బ్రాహ్మణులందరూ ఈ మహాసభకు విచ్చేసి, వివిధ అంశాలపై జరిగే చర్చల్లో పాల్గొనాలని కోరారు. తమ విలువైన సూచనలు అందిస్తూ బ్రాహ్మణ ఐక్యతను చాటిచెప్పాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో రమేష్ రావు, సురేంద్రాచారి, హన్మేష్, వాదిరాజ్, గోపాలాచారి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## పోరాటంతోనే దళితుల హక్కుల సాధన - రవీందర్

- **ఘనంగా డీహెచ్‌పీఎస్ 20వ ఆవిర్భావ వేడుకలు**

**వనపర్తి రూరల్, అక్టోబర్ 22 (జనంసాక్షి):** దళితులు సంఘటితమై పోరాడినప్పుడే తమ హక్కులను సాధించుకోవడం సాధ్యమవుతుందని డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రవీందర్ అన్నారు. వనపర్తి లోని డీహెచ్‌పీఎస్ కార్యాలయంలో 20వ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సంఘం జెండాను ఆవిష్క రించి మాట్లాడారు...

ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లలో దళితులకు 50 శాతం కేటాయిస్తామన్న హామీని అమలు చేయడం లేదని ఆరోపించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను సక్రమంగా ఖర్చు చేయడం లేదని అన్నారు. దళితులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలు ఇవ్వడం లేదని, రైతు భరోసా అందకపోవడంతోపాటు బ్యాంకుల్లో రుణాలు పొందడంలోనూ ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా దళితులపై దాడులు ఆగడం లేదని, కుల వివక్ష, అంటరానితనం ఇంకా కొనసాగుతూనే ఉన్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల విధానాలే ఇందుకు కారణ




మని విమర్శించారు. ఉన్నత విద్యను అభ్యసించిన దళిత నిరుద్యోగు లకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభించక ఆందోళన చెందు తున్నారని అన్నారు.

దళితుల సమస్యలకు పరిష్కారం లభించాలంటే పాలకుల విధానాలపై సంఘటితంగా పోరాడాలని రవీందర్ పిలుపునిచ్చారు. దళితులు డీహెచ్‌పీఎస్‌లో చేరి హక్కుల సాధన కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ సందర్భంగా రాజారాం, ప్రకాశ్, మల్లేపు నరసింహ, బాలిమియా తదితరులు దళితుల సమస్యలపై పాటలు పాడి తమ సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్, జిల్లా కమిటీ సభ్యుడు చిన్న కురుమన్న, మోష, రమేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావం.. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

జిల్లాలో వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక, గృహ అవసరాల కోసం బోర్లు తవ్వే ఏజెన్సీలు తప్పనిసరిగా సంబంధిత వాల్టా అథారిటీ లేదా భూగర్భ జల శాఖ వద్ద చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అధికారిక లిఖితపూర్వక అనుమతి లేదా ఎన్‌వోసీని పరిశీలించకుండా బోర్లు తవ్వకూడదన్నారు. ప్రభుత్వ, రక్షిత తాగునీటి వనరులైన మిషన్ భగీరథ, గ్రామపంచాయతీ, మున్సిపల్ బావులు, బోర్లకు 250 మీటర్ల పరిధిలో కొత్త బోర్లు తవ్వడం నిషేధమని తెలిపారు.

అతిగా భూగర్భ జలాలను వినియోగిస్తున్న, ప్రమాదకర స్థితిలో ఉన్న ప్రాంతాల్లో సాంకేతిక సాధ్యాసాధ్యాల నివేదిక లేకుండా లోతైన బోర్లు వేయరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే రిగ్గుల సీజ్, రిజిస్ట్రేషన్ రద్దు, పర్యావరణ నష్టపరిహారం విధించడంతో పాటు భూ యజమానులపై సహా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు.

## అనైక్యత వల్లే రాజ్యాధికారం కోల్పోతున్నాం

- **ఆత్మగౌరవం కోసమే మా పోరాటం: నీలం మధు**



**హత్నూర, అక్టోబర్ 22 (జనంసాక్షి):** ముదిరాజుల్లో అనైక్యత వల్లే రాజ్యాధికారం కోల్పోతున్నామని కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు నీలం మధు అన్నారు. పండుగ సాయన్న 174వ జయంతి సందర్భంగా దౌల్తాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీ విగ్రహం మీదుగా ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్ వరకు బ్యాండ్ మేళాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఐక్యంగా ముందుకు సాగితేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తాను ఏ పార్టీని ధిక్కరించడం లేదని, ఆత్మగౌరవం కోసమే పోరాడుతున్నానని పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిన పండుగ సాయన్న ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రాజేందర్, ఉపాధ్యక్షుడు అర్జున్, కోశాధికారి సతీష్, యాదగిరి, కృష్ణ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ ఆదర్శ్ సురభి

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా పర్యవేక్షించాలని, వ్యవసాయానికి నిర్ణీత సమయాల్లో విద్యుత్ అందించి, సరఫరా సమయాలను రైతులకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. అక్రమ విద్యుత్ వినియోగంపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.

పశుగ్రాసం కొరత రాకుండా లభ్యతను నిరంతరం పర్యవేక్షించి, అవసరమైన ప్రాంతాలకు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని పశు సంవర్ధక శాఖ అధికారులకు తెలిపారు. గ్రామీణ ఉపాధి కల్పనలో భాగంగా వి.బి.జి. రామ్‌జీ పథకం కింద చేపట్టగల పనులను ముందుగానే గుర్తించి సిద్ధం చేయాలన్నారు. బోరుబావుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పెంపునకు రీఛార్జ్ పనులు, ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ నీరు, విద్యుత్, పశుగ్రాసం, ఉపాధి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో యాదయ్య, డీఆర్‌డీవో ఉమాదేవి, డీఏవో ఆంజనేయులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పండుగ సాయన్న నేటి యువతకు ఆదర్శం

**మత్స్యశాఖ మండల అధ్యక్షుడు మిద్దె శ్రీనివాసులు**



**వీపనగండ్ల, అక్టోబర్ 23(జనంసాక్షి):** మండల కేంద్రంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ మండల అధ్యక్షుడు మిద్దె శ్రీనివాసులు మాట్లాడుతూ, దొరలు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి పేదలకు అండగా నిలిచిన గొప్ప నాయకుడు సాయన్న అని కొనియాడారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వెంకట స్వామి, ఉపాధ్యక్షుడు వెంకటయ్య, గ్రామస్థులు, మత్స్యశాఖ సభ్యులు పాల్గొన్నారు.

# దినేష్ మృతి తీరని విషాదం..

- **కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 22 (జనంసాక్షి):** రోడ్డు ప్రమాదంలో యువకుడు సింగనమోని దినేష్ మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. రెప్పపాటులో జరిగిన ప్రమాదం ఓ కుటుంబంలో తీరని శోకాన్ని మిగిల్చింది. కన్నకొడుకును కోల్పోయిన తల్లిదండ్రుల ఆవేదన పలువురిని కలచివేసింది. ఈ విషాదకర ఘటనతో బాధలో ఉన్న కుటుంబ సభ్యులను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వనపర్తి పట్టణంలోని చింతల హనుమాన్ దేవాలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సింగనమోని దినేష్ మృతదేహాన్ని వనపర్తి ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే సందర్శించారు. వనపర్తి మండలం మెట్టిపల్లి గ్రామానికి చెందిన శీను, సరిత దంపతుల కుమారుడైన దినేష్ అకాల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. పుత్రవియోగంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి బాధను పంచుకుంటూ, ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. అనంతరం ఇదే ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న పెబ్బేరు పట్టణానికి చెందిన గణేష్‌ను ఎమ్మెల్యే ఫోన్ ద్వారా పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైన ధైర్యాన్ని అందిస్తూ, గణేష్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామనే భరోసా కల్పించారు. ఒక కుటుంబానికి ఆధారంగా నిలవాల్సిన యువకుడు అకాల మరణం చెందడం అత్యంత బాధాకరమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. దినేష్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన గణేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# యాసంగిలో ఆరుతడి పంటల సాగు చేపట్టాలి: వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్



**కృష్ణ, అక్టోబర్ 22 (జనంసాక్షి):** నీటి లభ్యతను బట్టి యాసంగిలో ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేయాలని కృష్ణ మండలం వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్ అన్నారు. సాగు భూముల సంరక్షణ, నేల ఆరోగ్య పరిరక్షణ, పంటల మార్పిడి పై రైతులకు అవగాహన కల్పించేందుకు గురువారం కృష్ణ మండలం చేగుంట రైతు వేదికలో ఖేత్ బచావో అభియాన్ నిర్వహించారు.
ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సుద ర్శన్ గౌడ్ మాట్లాడుతూ, రాబోయే యాసంగి సీజన్ లో ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షపాతం, నీటి లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతులు ముంద స్తు జాగ్రత్తలు తీసుకోవాల ని సూచించారు. నీటి వన రుల లభ్యతను అంచనా వేసుకొని, విద్యుత్ విని యోగాన్ని దృష్టిలో ఉంచు కొని పంటల సాగుపై నిర్ణ యాలు తీసుకోవాలని తెలిపారు. యాసంగిలో అధిక నీటిని వినియోగించే వరి పంట సాగును సాధ్య మైనంత వరకు తగ్గించి, నీటి అవసరం తక్కువగా ఉండే శనగ, పెసర, మినుము వంటి పప్పుధాన్య పంటలను సాగు చేయడానికి ప్రాధాన్యత ఇవ్వా లని సూచించారు. పంట మార్పిడి విధానాన్ని అను సరించడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని వివరించా రు. నేల ఆరోగ్య పరిరక్షణ లో భాగంగా సేంద్రియ పదార్థాల వినియోగాన్ని పెంచాలని, పంట అవ శేషాలను నేలలో కలపా లని, నేల పరీక్షల ఆధారం గా సమతుల్య ఎరువులను వినియోగించాలని రైతు లకు సూచించారు. పంటల ఎంపికలో స్థానిక పరిస్థితు లు, నేల స్వభావం, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. రైతులు పంటల వైవిధ్యీకర ణను ప్రోత్సహిస్తూ సాగు ఖర్చులను తగ్గించుకోవాల ని, నీటి వనరులను సంర క్షించుకుంటూ స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని మండల వ్యవసాయ అధికారి పిలు పునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ ఒ సునీల్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

# రాయికోడ్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం



**రాయికోడు, అక్టోబర్ 22, (జనంసాక్షి):** రాయికోడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని శ్రీ కేతకి సంగమేశ్వర కాటన్ మిల్ లో గురువారం జిల్లా మార్కెటింగ్ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డిలు, సీసీఐ అధికారి శక్తి వెల్ తో కలిసి సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రంను ప్రత్యేక పూజలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మొదటి రకం పత్తికి క్వింటాలుకు 8,667, రూపాయల మద్దతు ధరను నిర్ణయించిందని తెలిపారు. రైతులు తమకు లాభమైన చోట తాము పండించిన పత్తిని అమ్ముకోవాలని సూచించారు.

**"రాయికోడు చౌరస్తాలో మార్కెటింగ్ చెక్ పోస్ట్ ప్రారంభం"**

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన అనంతరం రాయికోడు చౌరస్తాలో మార్కెట్ కమిటీ చెక్ పోస్ట్ జిల్లా మార్కెటింగ్ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం సుధాకర్ రెడ్డిలు టెంకాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ వీరిశెట్టి, వైస్ చైర్మన్ వినయ్ కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారులు సారిక రెడ్డి, అనిత, వీరభద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకరణి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కేదార్నాథ్ పాటిల్, మాజీ అధ్యక్షులు బాలాజీ నర్సింలు, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఏ ప్రభాకర్, సర్పంచులు సంగారెడ్డి, లక్ష్మణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జి విట్టల్, బక్కప్ప, నాయకులు రవి పటేల్, మక్సుద్, డీలర్లు విట్టల్ రావు కులకర్ణి, మల్లికార్జున్, రమేష్, గోపాల్, ఒగ్గు విట్టల్, పలువురు సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# భారీ ఊరేగింపుతో దుర్గామాత నిమజ్జనం

- **శోభయాత్రలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రజిని రవీందర్ గౌడ్**
- **సలాక రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో కనుల పండుగ శోభయాత్ర**





**తూప్రాన్, అక్టోబర్ 22 (జనం సాక్షి):** తూప్రాన్ పట్టణంలోని దేవి గార్డెన్ లో ప్రతిష్టించిన దుర్గ మాతను గురువారం రోజు భక్తిశ్రద్ధలతో బాజా భజంత్రీలు బ్యాండ్ మేళాలు పాటలతో నృత్యాలతో భారీ ఊరేగింపు నిర్వహించి సాయంత్రం నిమజ్జనం చేశారు. వేద పండితులు సలక రాజేశ్వరి శర్మ ఆధ్వర్యంలో తూప్రాన్ లోని దేవి గార్డెన్ లో దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్టించారు గత తొమ్మిది రోజుల 300 మంది మాలా దీక్షలో పాల్గొని దీక్ష చేశారు. గురువారం రోజు ఉదయం 9 గంటలకే శోభాయాత్ర ప్రారంభమైంది. నర్సాపూర్ చౌరస్తా నుండి తూప్రాన్ పట్టణంలోని బ్రాహ్మణ వీధి నుండి గాంధీనగర్ మీదుగా మసీదు నుండి చెరువు కట్ట వరకు భారీ ఊరేగింపు డ్యాన్సులు నృత్యాలతో పాటలతో శోభయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రాఘవేందర్ గౌడ్ వైస్ చైర్మన్ సమత కాశిరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊరేగింపు ప్రారంభించారు. మహిళల కోలాటాలతో పాటలతో తూప్రాన్ పురవీధులు మార్మోగాయి .చెరువు కట్ట వద్ద మాలలు ధరించిన వారు దీక్ష విరమణ చేశారు శోభాయమానంగా ఊరేగింపు కార్యక్రమం కనుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమంలో సలాక కృష్ణమూర్తి శర్మ కౌన్సిలర్ రఘుపతి రాములు శ్రీనివాస్ పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# టీఎన్జీవోస్
# నూతన జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం

- **అధ్యక్షుడిగా మహమ్మద్ జావిద్ అలీ**
- **కార్యదర్శిగా వేల్పూరు రవి**

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 22 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా టీఎన్జీవోస్ సంఘం నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కేంద్ర సంఘం మహిళా ఉపాధ్యక్షురాలు నిర్మల రాజకుమారి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించి, నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా మహమ్మద్ జావిద్ అలీ, జిల్లా కార్యదర్శిగా వేల్పూరు రవి, సహాధ్యక్షులుగా వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, కోశాధికారిగా కసిని శ్రీకాంత్, న్యాయ సలహాదారుగా భాస్కర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కృష్ణ, నాగేశ్వరరావు, శ్రీకాంత్, విజయలక్ష్మి, సంయుక్త కార్యదర్శులుగా షకీల్, నరసింహారెడ్డి, మోహనప్ప, సుధామణి, కార్యాలయ కార్యదర్శిగా సాయికుమార్ ఎన్నికయ్యారు. క్రీడల కార్యదర్శులుగా వెంకటేషం, రవికుమార్, మాణిక్యం, కార్యవర్గ సభ్యులుగా విజయ్ కుమార్, మురళీధర్, లక్ష్మి, పుష్పలత, బషీర్, సురేఖ, వినయ్, బాలామణి, శ్యాంసుందర్ ఎన్నికయ్యారు.
ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మహమ్మద్ జావిద్ అలీ మాట్లాడుతూ... ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి





కృషి చేస్తామని, ఉద్యోగుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ సంఘాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.
జిల్లా కార్యదర్శి వేల్పూరు రవి మాట్లాడుతూ... జిల్లాలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. సంఘం నాయకులు, సభ్యుల సమన్వయంతో ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని అన్నారు.
నూతన కార్యవర్గం ఉద్యోగుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారి హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పనిచేయాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బలరాం, జగన్, పట్టణ బాధ్యులు ప్రమోద్ కుమార్, యాదవ్ రెడ్డి, వెంకట్, మిస్కిన్, దత్తు, నర్సింలు, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేనిదే బోర్ డ్రిల్లింగ్ చేయొద్దు



**కృష్ణ, అక్టోబర్ 22 (జనంసాక్షి):** అనుమతి లేకుండా ఎవరూ కొత్తగా బోర్ డ్రిల్లింగ్ చేయొద్దని చేస్తే చర్యలు తప్పవని కృష్ణ తహశీల్దార్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ఎల్‌నీనో ప్రభావం వలన సమృద్ధిగా వర్షాలు కుర్వనందున కృష్ణ మండలంలో అన్ని గ్రామాల్లో బోర్ డ్రిల్లింగ్ చేయుటకు తహసీల్దార్ అనుమతి, జూలాజికల్ డిపార్ట్మెంట్ అనుమతి యుండాలనీ తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా బోర్ డ్రిల్లింగ్ చేసినచో వారిపై చట్టపరంగా చర్యలు తిసుకోబడు తయనీ హెచ్చరించారు.

## లోన్ తీసుకోకుండానే రూ.20 లక్షల రుణం చూపిస్తున్నారని ఆరోపణ



**చేర్యాల, అక్టోబర్ 22 (జనంసాక్షి):** చేర్యాలలోని శ్రీరామ్ చిట్ ఫండ్ కంపెనీ పై చంద శ్రీకాంత్ మోసం ఆరోపణలు చేశారు. తాను ఎలాంటి రుణం తీసుకోక పోయినా, 2023 జూన్ నుంచి తన పేరిట రూ.20 లక్షల బిజినెస్ లోన్ చూపిస్తున్నారని తెలిపారు. దీంతో సిబిల్ స్కోర్ పడిపోయి ఇతర బ్యాంకుల్లో రుణాలు పొందలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై బ్రాంచ్ మేనేజర్, డీఎంను సంప్రదించినా స్పందన లేదన్నారు. ఇలాంటి బాధితులు మరెందరో ఉన్నారని పేర్కొంటూ, సంబంధిత కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ బీమా, పెన్షన్ పథకాల్లో చేరాలి

### ప్రభుత్వ పథకాలతో ఆర్థిక భద్రత.. గ్రామీణులకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేయాలి: కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, అక్టోబర్ 22 (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ బీమా, పెన్షన్ పథకాలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక భద్రత పొందాలని పిలుపునిచ్చారు.

వనపర్తి మండలం నాచహల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్థిక సమ్మిళిత పథకాల ప్రచార శిబిరానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడంలో ప్రభుత్వ బీమా, పెన్షన్ పథకాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.




ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ద్వారా ఏడాదికి కేవలం రూ.20 ప్రీమియంతో రూ.2 లక్షల ప్రమాద బీమా రక్షణ పొందవచ్చని వివరించారు. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ద్వారా ఏడాదికి రూ.436 ప్రీమియంతో, పథకం నిబంధనలకు అనుగుణంగా మరణించిన సందర్భంలో రూ.2 లక్షల బీమా ప్రయోజనం లభిస్తుందని పేర్కొన్నారు.



అలాగే అటల్ పెన్షన్ యోజనపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అర్హతలు, పథకం నిబంధనలకు అనుగుణంగా క్రమం తప్పకుండా పొదుపు చేయడం ద్వారా వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత పొందవచ్చని తెలిపారు. ఇప్పటివరకు ఈ పథకాల్లో చేరని అర్హులు సమీప బ్యాంకులను సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హెచ్చరించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, పిన్ వంటి రహస్య సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంచుకోవడంతో పాటు పొదుపు అల వాటును పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ శిబిరంలో యూనియన్ బ్యాంక్ సిబ్బంది వివిధ బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ బీమా, పెన్షన్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్బీఐ ఏజీఎం ప్రదీప్ చంద్ర, నాబార్డ్ డీడీఎం మనోహర్ రెడ్డి, ఎల్డీఎం శివకుమార్, డీఎల్పీవో రఘునాథ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ అబ్దుల్లా, సంబంధిత అధికారులు, బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ... మహిళల ఆటపాటలతో సందడి

- మల్లారెడ్డి పేట్‌లో ఉత్సాహంగా మతకమ్మ సంబరాలు
- మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్విరాజ్







**మునిపల్లి, అక్టోబర్ 22 (జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలు మునిపల్లి మండలంలోని మల్లారెడ్డిపేట్ గ్రామంలో గురువారం నిర్వహించినట్లు మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం దసరా పండగ అనంతరం నిర్వహించే బతకమ్మ ఉత్సవాలలో గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొంటారు. పెళ్లిళ్లు అయినా ఆడపడుచులు తమ సొంత గ్రామానికి చేరుకొని బతకమ్మ సంబరాల్లో పాల్గొంటారు. గురువారం నిర్వహించిన బతుకమ్మ సంబరాలు మహిళలు పెద్ద సంఖ్యలో ఆటపాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం గ్రామ శివారులో గల చెరువులో బతకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పృధ్విరాజ్ మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం గ్రామంలో దసరా అనంతరం బతకమ్మ వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామంలోని మహిళలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల మహిళలు కూడా బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు ఆయన తెలిపారు.

## పిచరాగడి తాండలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

- అంబేద్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలి
- తొలి గిరిజన తాండలో విగ్రహ ఏర్పాటుపై దళిత, గిరిజన సంఘాల హర్షం



**కోహిర్, అక్టోబర్ 22 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం పిచరాగడి పాత తాండలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు గురువారం భూమిపూజ నిర్వహించారు. తాండ గ్రామ పంచాయతీ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ కోహిర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు, సర్పంచ్ ప్రతినిధి రాథోడ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వివిధ గ్రామాల నుంచి దళిత, గిరిజన, అంబేద్కర్ సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. సమానత్వం, సామాజిక న్యాయం, విద్య, స్వేచ్ఛ, సోదరభావం వంటి ఆయన ఆశయాలను జీవితంలో ఆచరించాలని సూచించారు. అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటు ద్వారా ఆయన సేవలు, పోరాటాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయవచ్చని పేర్కొన్నారు.



జహీరాబాద్ నియోజకవర్గంలోని తొలి గిరిజన తాండగా గుర్తింపు పొందిన పిచరాగడిలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషకరమని నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతంలో మహనీయుడి విగ్రహ ఏర్పాటుకు చొరవ చూపిన రాథోడ్ వినోద్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అంబేద్కర్ ఆశయాలు అన్ని వర్గాల ప్రజలకు స్ఫూర్తినిస్తాయని, ఆయన జీవితం యువతకు మార్గదర్శకమని అన్నారు. గ్రామ పంచాయతీ ఆవరణలో విగ్రహం ఏర్పాటు కావడం ద్వారా ప్రజలు ఆయన సేవలను నిరంతరం గుర్తుచేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం గ్రామంలో సామాజిక ఐక్యత, సమానత్వ భావనలను బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో తాండ మాజీ సర్పంచ్ చౌహాన్ చందర్, వార్డు సభ్యులు రామావత్ నర్సింలు, రాథోడ్ సంజీవ్ కుమార్, సజ్జాపూర్ ఉపసర్పంచ్ మైసయ్య, లోకనాధం, భాగ్యారి అశోక్, టీ. సంజీవులు, ప్రకాష్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోలు చేయాలి

- డీలర్ల అవగాహన సదస్సులో డీఏఓ శివప్రసాద్, డీఎంఓ శ్రీకాంత్



**రాయికోడు, అక్టోబర్ 22 (జనంసాక్షి):** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పత్తి కొనుగోళ్లు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీకాంత్ సూచించారు. గురువారం రాయికోడు రైతు వేదికలో నిర్వహించిన డీలర్ల అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. డీలర్లు త్వరగా ట్రేడ్ లైసెన్సులు పొందాలని, మార్కెటింగ్ పన్ను తప్పనిసరిగా చెల్లించాలని తెలిపారు. జిల్లాలో 3.57 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినందున రబీ సాగులో రైతులు నష్టాలను అంచనా వేసుకోవాలని సూచించారు. లైసెన్సులు లేకుండా పత్తి కొనుగోలు చేస్తే చర్యలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం. సుధాకర్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

## యువతను రెచ్చగొట్టే వ్యాఖ్యలు సరికాదు



**కోహెడ, అక్టోబర్ 22 (జనంసాక్షి):** ధర్మసాగర్‌పల్లిలో జరిగిన ఘటనపై వాస్తవాలు తెలుసుకోకుండా యువతను రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శెట్టి సుధాకర్ పటేల్ అన్నారు. దసరా సందర్భంగా ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలను మహిషాసురుడి రూపంలో దహనం చేసిన ఘటనలో ప్రమేయం ఉన్నవారిపైనే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఈ అంశంపై వ్యాఖ్యలు చేసిన సతీష్ కుమార్ వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని యువతకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మంత్రి పొన్నం ప్రభాకర్‌పై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. గడువులోగా క్షమాపణ చెప్పకపోతే పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో కరివేద చంద్రారెడ్డి, మంద ధర్మయ్య, దొమ్మాట జగన్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.